

తాటిచెట్లపాలెం జాతీయ రహదారి వద్ద వర్షం

విద్యుత్ సరఫరా తక్షణ పునరుద్ధరణకు చర్యలు

- 15 వేల విద్యుత్ స్తంభాలు, 950 ట్రాన్స్‌ఫార్మర్లు సిద్ధం
- ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్

విశాఖపట్నం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ నేపథ్యంలో ఎక్కడైనా విద్యుత్ సరఫరా నిలిచిపోతే తక్షణమే పునరుద్ధరించడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నామని ఏపీ ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ తెలిపారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ, సంస్థ పరిధిలోని ... మిగతా 6వ పేజీలో

పర్యాటక కేంద్రాలన్నీ మూసివేత

- టూర్ ప్యాకేజీ బస్సులన్నీ రద్దు
- కైలాసగిరి, రుషికొండ బీచ్‌లలోకి నో ఎంట్రీ

విశాఖపట్నం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో భారీవర్షాలు కురుస్తుండడంతో అధికారులు ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగా జిల్లాలోని పర్యాటక కేంద్రాలను సోమవారం మూసివేశారు. ముఖ్యంగా రుషికొండ బీచ్‌లోకి పర్యాటకులు ఎవరూ వెళ్లకుండా బారికేడ్లు ఏర్పాటు చేసి పోలీసు గస్తీ పెట్టారు. డీజీ గోపీనాథ్ జెట్టీ వెళ్లి అక్కడి సిబ్బందికి పలు సూచనలు చేశారు. స్పీడ్ బోట్లు నిలిపివేశారు. ఫిషింగ్ హార్బర్‌లో పర్యాటకులను సముద్రంలోకి తీసుకువెళ్లే బోటును కూడా ఆపేశారు. బీచ్‌రోడ్డులో పర్యాటకుల కోసం అందుబాటులోకి తీసుకువచ్చిన అద్దాల డబుల్ డెక్కర్ హాప్ ఆన్ హాప్ ఆఫ్ బస్సులను సైతం నిలిపివేశారు. రోజూ పర్యాటకుల కోసం నడిపే టూర్ ప్యాకేజీ బస్సులను కూడా రద్దు చేశారు. అరకులోయ రైలు కమ్ రోడ్ ప్యాకేజీ టూర్‌ను కూడా రద్దు చేసినట్టు డివిజనల్ మేనేజర్ జగదీశ్ తెలిపారు. వీఎంఆర్‌డీఏ అధికారులు కైలాసగిరిపైకి ఎవరూ వెళ్లకుండా స్టాపర్లు పెట్టేశారు. తెన్నేటి పార్క్, హెల్త్ ఎరీనా, వీఎంఆర్‌డీఏ పార్కుల్లోకి కూడా అనుమతులు లేవని సందర్శకులను వెనక్కి పంపించేశారు. తుఫాన్ తీరం దాటి, వర్షాలు తగ్గుముఖం పట్టాక, కలెక్టర్ సూచన మేరకు ఇవన్నీ తెరుస్తామని పర్యాటక శాఖాధికారులు తెలిపారు.



సాగర్‌నగర్ బీచ్ లోపలకు సందర్శకులు వెళ్లకుండా ఏర్పాటు చేసిన బారికేడ్లు

విశాఖ జిల్లాకు రెడ్ అలర్ట్

తుఫాన్ నేపథ్యంలో వాతావరణ శాఖ జారీ

- ఎడతెరిపి లేకుండా వర్షం... రోడ్లన్నీ జలమయం
- మధురవాడ జాతర వద్ద 10.6 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు
- కూలుతున్న చెట్లు... నిలిచిపోతున్న విద్యుత్ సరఫరా
- నేడు పలుచోట్ల కుంభవృష్టిగా వర్షాలు
- ఉదయం నుంచి పెరగనున్న గాలులు
- సాయంత్రం గంటకు 60 నుంచి 70 కి.మీ. వేగంతో గాలులు
- విశాఖ, గంగవరం రేవుల్లో ఆరో నంబరు డేంజర్ సిగ్నల్
- ఆరోగ్య శాఖ అప్రమత్తం
- అర్బన్ హెల్త్ సెంటర్లు 24 గంటలూ తెరిచే ఉంచాలని ఆదేశం

విశాఖపట్నం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో తుపాన్ ('మొంథా')తో విశాఖ జిల్లాకు వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ మెసేజ్ జారీచేసింది. సోమవారం రాత్రికి తుఫాన్ విశాఖకు 500 కి.మీ. దక్షిణ ఆగ్నేయంగా పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతం కావడంతో వర్షాలు మరింత పెరిగే అవకాశం ఉంది. సోమవారం రోజంతా కుండపోతగా వర్షం కురిసింది. సోమవారం రాత్రి నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు నగరంలో అక్కడక్కడా కుంభవృష్టిగా, మిగిలినచోట్ల భారీవర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో నగరంలో లోతట్టు ప్రాంతాలు నీట మునిగే అవకాశం ఉంది. మంగళవారం ఉదయం నుంచి గాలులు పెరిగి సాయంత్రానికి గంటకు 60 నుంచి 70 కి.మీ. వేగంతో వీయనున్నాయి. సముద్ర అలలు అరమీటరు వరకు ఎగిసిపడి సముద్రం నీరు ముందుకువచ్చే అవకాశం ఉంది. గాలులు తీవ్రతకు చెట్లు, హోర్డింగ్‌లు నేలకొరిగే ప్రమాదం ఉండడంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. కాగా విశాఖపట్నం, గంగవరం ఓడరేవుల్లో ఆరో ... మిగతా 6వ పేజీలో



హనుమంతవాక జంక్షన్‌లో వర్షం

కంట్రోల్ రూమ్‌లు

- కలెక్టరేట్: 0891-2590100, 0891-2590102
- జీవీఎంసీ: 1800 4250 0009, 9866909192 (వాట్సాప్), 0891-2869106
- ఏపీఈపీడీసీఎల్: 7382299975
- మెడికల్: 9993489519
- ఫైర్: 101, 0891-2563582
- పంచాయతీ: 70138 16205
- భీమిలి ఆర్డీవో: 8074425598
- విశాఖపట్నం ఆర్డీవో: 0891-2562977

సోమవారం ఉదయం ఎనిమిదిగంటల నుంచి రాత్రి 10.30 గంటల వరకు నగరంలో నమోదైన వర్షపాతం వివరాలు

కేంద్రం	కురిసిన వర్షపాతం (సెంటీమీటర్లు)
జాతర (మధురవాడ)	10.6
విశాఖ కామన్ పాయింట్	10.1
హెచ్‌బీ కాలనీ	10.1
చంద్రంపాలెం ఉన్నత పాఠశాల	10
సీతమ్మధార	9.8
వేపగుంట	9.75
గోపాలపట్నం	9.5

నేడు భారీగా రైళ్లు రద్దు

- జాబితాలో 'ప్రశాంతి', 'విశాఖ', తిరుపతి-విశాఖ స్పెషల్, పలు పాసింజర్ రైళ్లు
- రేపు కూడా కొన్ని...
- మరికొన్ని దారిమళ్లింపు, గమ్యాల కుదింపు



ప్రయాణికులకు వివరాలు తెలుపుతున్న రైల్వే స్టేషన్‌లోని హెల్ప్‌డెస్క్ సిబ్బంది

విశాఖపట్నం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ నేపథ్యంలో వాల్తేరు రైల్వే డివిజన్ అధికారులు ఈ నెల 28, 29 (మంగళ, బుధవారాలు) తేదీల్లో పలు రైళ్లను రద్దు చేశారు. మంగళవారం రద్దయిన రైళ్లు: విశాఖ-కిరండూల్ నైట్ ఎక్స్‌ప్రెస్ (18516), విశాఖ-కిరండూల్ పాసింజర్ (585801), కిరండూల్-విశాఖ పాసింజర్ (58502), విశాఖ-కొరాపుట్ పాసింజర్ (58538), కొరాపుట్-విశాఖ పాసింజర్ (58537), కొరాపుట్-విశాఖ ఎక్స్‌ప్రెస్ (18511), రాజమండ్రి-విశాఖ మెము పాసింజర్ (67285), విశాఖ-రాజమండ్రి మెము (67286), విశాఖ-కాకినాడ (17268), కాకినాడ-విశాఖ (17267), తిరుపతి-విశాఖ ప్రత్యేక రైలు (08584), విశాఖ-గుంటూరు డబుల్ డెక్కర్ ఉదయ్ ఎక్స్‌ప్రెస్ (22875), గుంటూరు-విశాఖ డబుల్ డెక్కర్ ఉదయ్ ఎక్స్‌ప్రెస్ (22876), బ్రహ్మపూర్-విశాఖ ఎక్స్‌ప్రెస్ (18525), విశాఖ-పలాస మెము (67289), పలాస-విశాఖ మెము (67290), విజయనగరం-విశాఖ మెము (67288), కటక్-గుణుపూర్ మెము (68433), బ్రహ్మపూర్-విశాఖ పాసింజర్ (58531), విశాఖ-బ్రహ్మపూర్ పాసింజర్ (58532), విశాఖ-గుణుపూర్ పాసింజర్ (58506), గుణుపూర్-విశాఖ పాసింజర్ (58505), మహబూబ్‌నగర్-విశాఖ ఎక్స్‌ప్రెస్ (12862), భువనేశ్వర్-బెంగళూరు ప్రశాంతి (18463), భువనేశ్వర్-సికింద్రాబాద్ విశాఖ ఎక్స్‌ప్రెస్ (17015), భువనేశ్వర్-పాండిచ్చేరి ఎక్స్‌ప్రెస్ (20851)

బుధవారం రద్దయిన రైళ్లు: గుణుపూర్-కటక్ మెము (68434), న్యూఢిల్లీ-విశాఖ ఏపీ ఎక్స్‌ప్రెస్ (20806), విశాఖ-ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ (18520)

ఇక టాటానగర్-ఎర్నాకులం ఎక్స్‌ప్రెస్ (18189)ను మంగళవారం దారి మళ్లించి టిట్లాగర్, రాయపూర్, నాగపూర్, బలార్ష మీదుగా నడపనున్నారు. అలాగే భువనేశ్వర్-జగదల్‌పూర్ హిరాఖండ్ ... మిగతా 6వ పేజీలో

అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దు

ప్రజలకు జిల్లా ప్రత్యేకాధికారి, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ సూచన

- రాబోయే 38 నుంచి 46 గంటలు అత్యంత కీలకం



మీడియాతో మాట్లాడుతున్న అజయ్‌జైన్. చిత్రంలో కలెక్టర్ హరేంధిరప్రసాద్ ఉన్నారు.

విశాఖపట్నం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): 'మొంథా' తుపాన్ తీవ్రత ఎక్కువగా ఉన్నందున ప్రజలు చాలా అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే తప్ప బయటకు రావొద్దని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ సూచించారు. సోమవారం సాయంత్రం ఆయన కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తుపాన్ 28వ తేదీ అర్ధరాత్రి గానీ, 29వ తేదీ తెల్లవారుజామునగానీ తీరం దాటే అవకాశం ఉందన్నారు. కోస్తాలో 17 నుంచి 19 జిల్లాలు ప్రభావితం కానున్నాయని, వాటిలో తొమ్మిది అత్యంత ప్రభావితం కానున్నాయన్నారు. మొత్తం 87 మండలాలు, 705 గ్రామాలు, 16 అర్బన్ ప్రాంతాలు బాగా ప్రభావితం కానున్నాయని తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని, కొండవాలు ప్రాంతాల్లో ఉండేవారు జాగ్రత్తగా ఉండాలని ... మిగతా 6వ పేజీలో

పునరావాస కేంద్రాలకు కొండవాలు ప్రాంతాల వాసులు

- జీవీఎంసీ పరిధిలో 74 కేంద్రాలు ఏర్పాటు
- చెట్లు, గోడలు వంటివి కూలితే వెంటనే తొలగించేందుకు 20 క్విక్ రెస్పాన్స్ టీమ్‌లు ఏర్పాటు
- ప్రధాన కార్యాలయంతో పాటు అన్ని జోనల్ కార్యాలయాల్లో కంట్రోల్‌రూమ్‌లు
- జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్



కమాండ్ కంట్రోల్ రూంలో జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్

విశాఖపట్నం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాన్ నేపథ్యంలో జీవీఎంసీ పరిధిలో ఆస్తి, ప్రాణనష్టం వాటిల్లకుండా కొండవాలు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిసారించినట్టు కమిషనర్ కేతన్‌గార్గ్ తెలిపారు. జీవీఎంసీ పరంగా తీసుకుంటున్న జాగ్రత్తలు, చర్యలను ఆయన సోమవారం రాత్రి 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధికి వివరించారు. తుపాన్ ప్రభావంతో విస్తారంగా వర్షాలు కురుస్తున్నందున కొండవాలు ప్రాంతాల్లో మట్టి, కొండ చరియలు విరిగిపడే ప్రమాదం ఉంది కాబట్టి, అక్కడ ఉంటున్న వారిని ... మిగతా 6వ పేజీలో

ఆర్టీసీకి ఎఫెక్ట్

- 60 శాతానికి పడిపోయిన ఆక్యుపెన్సీ
- 60 బస్సులు రద్దు
- రాత్రి 8 గంటల తరువాత దూర ప్రాంతాలకు బయలుదేరాల్సిన సర్వీస్‌లన్నీ క్యాన్సిల్



తుఫాన్ ప్రభావంతో ఖాళీగా ఉన్న బస్సు

ద్వారకా బస్‌స్టేషన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): 'మొంథా' తుఫాన్ కారణంగా ప్రయాణికులు తగ్గడంతో ఆర్టీసీ విశాఖ రీజియన్ యాజమాన్యం సోమవారం 60 బస్సులు రద్దు చేసింది. మిగిలిన బస్సుల్లో కూడా ఆక్యుపెన్సీ రేషియో 60 శాతం మాత్రమే నమోదయ్యింది.

తుఫాన్ కారణంగా సోమవారం తెల్లవారుజామున భారీవర్షం పడడంతో షెడ్యూల్ ప్రకారం 4.00 గంటలకు వెళ్లాల్సిన బస్సులు డిపోల నుంచి గంట ఆలస్యంగా బయలుదేరాయి. ఉదయం 7.00 గంటల వరకూ షెడ్యూల్ సర్వీస్‌లన్నీ 20 ఆక్యుపెన్సీ రేషియోతో తిరిగాయి. పరిస్థితి గమనించిన ఆర్టీసీ అధికారులు డిమాండ్ లేని రూట్లలో 50 బస్సులు రద్దు చేశారు. గుణుపూరు, పర్లాకిమిడి, పాడేరు, సీలేరు సర్వీసులను తాత్కాలికంగా రద్దు చేశారు. అలాగే కొండ చరియలు విరిగిపడే అవకాశం ఉన్న ఘాట్ రోడ్లలో సర్వీసులను రద్దు చేశారు. సీలేరు, భద్రాచలం రోడ్డు బాగుండనందున ఆ రూట్‌లో తిరిగే సర్వీసులు కూడా తాత్కాలికంగా నిలిపివేశారు. రాత్రికి భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున విశాఖ నుంచి హైదరాబాద్, విజయవాడ, తిరుపతి, కర్నూలు వంటి ప్రాంతాలకు వెళ్లాల్సిన నైట్ అవుట్ సర్వీసులన్నింటినీ రద్దు చేశారు. రాత్రి 8.00 తరువాత దూర ప్రాంతాలకు బయలుదేరాల్సిన బస్సులను తాత్కాలికంగా రద్దు చేసినట్టు రీజనల్ అధికారులు ... మిగతా 6వ పేజీలో

శివాలయాలకు కార్తీక శోభ



సీతంపేట పార్వతీపరమేశ్వరుల ఆలయ ధ్వజస్తంభం వద్ద దీపాలు వెలిగిస్తున్న మహిళలు

కార్తీక మాసం సందర్భంగా సోమవారం జిల్లాలోని శైవ క్షేత్రాలు భక్తులతో కిక్కిరిశాయి. ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసిన అనంతరం ధ్వజస్తంభాల వద్ద మహిళలు పెద్ద సంఖ్యలో కార్తీక దీపాలను వెలిగించారు.

- విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి



అగనంపూడి వద్ద ప్రైవేటు బస్సులను తనిఖీ చేస్తున్న రవాణా శాఖ అధికారులు

ఆరు బస్సులపై కేసు, మరొకటి సీజ్

విశాఖపట్నం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): నిబంధనలు పాటించకుండా ప్రయాణికులను తరలిస్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సులపై రవాణా శాఖ అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. సోమవారం మూడు బృందాలుగా విడిపోయి నగరం నుంచి రాకపోకలు సాగించే బస్సులను తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా బస్సులో సీట్లను ఏర్పాటుచేసిన ఆరు బస్సులపై కేసులు నమోదుచేశారు. పర్మిట్‌తోపాటు ఇతర పన్నులు చెల్లించని కావేరి ట్రావెల్స్‌కు చెందిన బస్సును సీజ్ చేసినట్టు జిల్లా రవాణా శాఖ ఉపకమిషనర్ ఆర్‌సీహెచ్ శ్రీనివాసరావు తెలిపారు.

ఏసీబీ వలలో సచివాలయ కార్యదర్శి, ఆర్‌ఐ

- రెవెన్యూ రికార్డుల్లో పేరు మార్చేందుకు లంచం డిమాండ్
- రూ.30 వేలు తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు



ఏసీబీకి పట్టుబడిన ఆర్‌ఐ ముగడ రాజు, సచివాలయ కార్యదర్శి స్వామినాయుడు

తగరపువలస, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ రెండో వార్డు పరిధిలోని బొగ్గులదిబ్బ గ్రామ సచివాలయ కార్యదర్శి, జీవీఎంసీ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రూ.30 వేలు లంచం తీసు కుంటూ సోమవారం సాయంత్రం ఏసీబీ అధికారులకు చిక్కారు. ఏసీబీ డీఎస్పీ బీవీఎస్ఎస్ రమణమూర్తి తెలిపిన వివరాలు ప్రకారం... చిట్టివలస గ్రామానికి చెందిన యువకుడు తనకు వారసత్వంగా వచ్చిన ఇంటికి హక్కుదారుడిగా నమోదు చేయాల్సిందిగా గత నెలలో గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేసుకున్నాడు. అతని తాత... ఇంటిని మేనత్తలకు చెందేలా వీలునామా రాశారు. వారి నుంచి ఈ యువకుడు ఇంటిని కొనుగోలు చేశాడు. ఆ డాక్యుమెంట్లు, ఇతర వివరాలను గ్రామ కార్యదర్శి వైస్వామినాయుడు, సచివాలయం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ముగడ రాజుకు చూపించి రెవెన్యూ రికార్డుల్లో తన పేరు నమోదు చేయాలని కోరాడు. ఈ విషయమై ... మిగతా 6వ పేజీలో

విశాఖ జిల్లాకు రెడ్ అలర్ట్

... 5వ పేజీ తరువాయి

నంబరు డేంజర్ సిగ్నల్ ఎగురవేశారు. దీంతో పోర్టులో వాణిజ్య కార్యకలాపాలు నిలిపివేశారు. బుధవారం తుఫాన్ తీరం దాటేంత వరకు పోర్టుల్లో డేంజర్ సిగ్నల్స్ కొనసాగే అవకాశం ఉంది.

ముసురు

తుఫాన్ జిల్లాపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఆదివారం రాత్రి నుంచే వర్షాలు ప్రారంభమయ్యాయి. సోమవారం రాత్రి వరకూ కురుస్తూనే ఉన్నాయి. గాలులకు చెట్ల కొమ్మలు విరిగి రోడ్లకు అడ్డంగా పడుతున్నాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతోంది. మురుగు కాలువల్లో పూడికలు, చెత్త తొలగించకపోవడంతో ఈ వర్షాలకు అవన్నీ రోడ్లపైకి చేరుతున్నాయి. అనేకచోట్ల అండర్ గ్రౌండ్ డ్రైనేజీకి చెందిన మ్యాన్‌హోళ్ల నుంచి నీరు పైకి ఎగజిమ్ముతోంది.

ఆరోగ్య శాఖ అప్రమత్తం

తుఫాన్ నేపథ్యంలో ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. జిల్లాలోని అర్బన్ హెల్త్ సెంటర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సిబ్బంది నిరంతరం సేవలు అందించాలని అధికారులు ఆదేశించారు. సోమవారం సాయంత్రం ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు నిర్వహించిన సమీక్షా సమావేశంలో జిల్లా యంత్రాంగానికి కీలక ఆదేశాలను జారీచేశారు. అందుకు అనుగుణంగా జిల్లా అధికారులు క్షేత్రస్థాయి సిబ్బందిని అప్రమత్తం చేశారు. మంగళవారం నుంచి వైద్యులు విధులు నిర్వర్తిస్తున్న ప్రాంతంలోనే ఉండాలని సూచించారు. అలాగే తుఫాన్ ప్రభావం అధికంగా ఉంటుందని గుర్తించిన 66 ప్రాంతాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటుచేయాలని సిబ్బందికి ఆదేశాలు ఇచ్చారు. నగర పరిధిలోని అర్బన్ హెల్త్ సెంటర్లు కూడా 24 గంటలు తెరిచే ఉంచాలని, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఆరోగ్య కేంద్రాల్లో తప్పనిసరిగా యాంటీ స్నేక్ వీనం, ఓఆర్ఎస్, ఏఆర్‌వీ, ఐవీ ఫ్లూయిడ్స్‌ను సిద్ధంగా ఉంచుకోవాలని స్పష్టంచేశారు.

బోట్ క్లినిక్‌లుగా వాహనాలు

జిల్లాకు కేటాయించిన ఏడు 104, మరో 16 అంబులెన్స్‌లు (108), 23 తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్ (102 వాహనాలు)లను తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో మత్స్య శాఖ అధికారులతో కలిసి బోట్ క్లినిక్స్‌గా ఏర్పాటుచేస్తున్నారు. పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ పరిధిలో ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లను ఏర్పాటు చేసుకుని డాక్టర్, పారామెడికల్ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు సూచించారు.

నేడు భారీగా రైళ్లు రద్దు

... 5వ పేజీ తరువాయి

ఎక్స్‌ప్రెస్ (18447), రూర్కెలా-జగదల్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌లు (18107) రాయగడ వరకు నడిచేలా గమ్యాలను కుదించారు.

సోమవారం యథావిధిగా బయలుదేరిన రైళ్లు

తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా సోమవారం రద్దు చేసిన రైళ్లను తిరిగి పునరుద్ధరించామని రైల్వే అధికారులు ప్రకటించారు. విశాఖ-తిరుపతి స్పెషల్ (08583), విశాఖ-తిరుపతి డబుల్ డెక్కర్ (22707), విశాఖ-మచిలీపట్నం (17220), విశాఖ-హైదరాబాద్ గోదావరి ఎక్స్‌ప్రెస్ (12727), విశాఖ-మహబూబ్‌నగర్ ఎక్స్‌ప్రెస్ (12861), విశాఖ-చెన్నై సెంట్రల్ (22869), విశాఖ-సికింద్రాబాద్ గరీబ్‌రథ్ (12739), విశాఖ-న్యూఢిల్లీ ఏపీ ఎక్స్‌ప్రెస్ (20806), విశాఖ-ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ (18519) వంటి ఒరిజినేటింగ్ రైళ్లతోపాటు గుంటూరు-రాయగడ ఎక్స్‌ప్రెస్ (17243), రాయగడ-గుంటూరు ఎక్స్‌ప్రెస్ (17244) సోమవారం యథావిధిగా ఒరిజినేటింగ్ స్టేషన్ల నుంచి బయలుదేరాయి.

ఆర్టీసీకి ఎఫెక్ట్

... 5వ పేజీ తరువాయి

ప్రకటించారు. మధ్యాహ్నం నుంచి రాత్రి 8.00 గంటలమధ్య దూర ప్రాంతాలకు బయలుదేరిన బస్సులను ట్రాకింగ్ సిస్టమ్ ద్వారా ద్వారకా కాంప్లెక్స్‌లోని కంట్రోలర్లు పర్యవేక్షిస్తున్నారు.

60 శాతం ఓఆర్‌కే పరిమితం

మిగిలిన బస్సుల సగటు ఆక్యుపెన్సీ రేషియో 60 శాతంగా నమోదయ్యింది. సాధారణ రోజుల్లో 85 నుంచి 90 శాతం ఉన్న ఆక్యుపెన్సీ రేషియో సోమవారం 60 శాతానికి పడిపోయింది. రీజియన్‌లో ప్రస్తుతం 740 షెడ్యూల్ సర్వీసులు ఉండగా, అందులో 60 రద్దు చేయగా మిగిలిన 680 సర్వీసులు నడిపినా ఆక్యుపెన్సీ రేషియో పెద్దగా లేదు. మంగళవారం కూడా ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

ఘాట్ రోడ్లు, గుంతల రోడ్లలో బస్సులు నడపొద్దు

- బి.అప్పలనాయుడు, రీజనల్ మేనేజర్

ఘాట్‌రోడ్లు, వర్షం నీటితో నిండిన గుంతల రోడ్లలో బస్సులు నడపవద్దని డ్రైవర్లకు ఆర్టీసీ రీజనల్ మేనేజర్ ఆదేశాలు జారీచేశారు. అలాంటి పరిస్థితి ఉంటే బస్సులను అందుబాటులో ఉన్న ఆర్టీసీ డిపోలో నిలిపివేయాలని సూచించారు. సంబంధిత సమాచారాన్ని ఆర్ఎం కార్యాలయంలోని కంట్రోల్ రూమ్‌కు చేరవేయాలని సూచించారు. ఎవ్వరూ రిస్క్ తీసుకోవద్దు, ప్రయాణికులను ప్రమాదంలోకి నెట్టవద్దని డ్రైవర్లకు సూచించారు.

పునరావాస కేంద్రాలకు కొండవాలు ప్రాంతాల వాసులు

... 5వ పేజీ తరువాయి

పునరావాస కేంద్రాలకు తరలించాలని నిర్ణయించామన్నారు. జీవీఎంసీ పరిధిలో 135 ప్రాంతాల్లో 14,431 కుటుంబాలు కొండవాలు ప్రాంతాల్లో నివాసం ఉంటున్నాయని, అందులో ఐదుచోట్ల 249 కుటుంబాలకు ముప్పుపొంచి ఉందని భావిస్తున్నామన్నారు. వారితోపాటు మధ్యస్థ ముప్పు కలిగివున్న ప్రాంతాల్లోని కుటుంబాలను కూడా పునరావాస ప్రాంతాలకు తరలించాలని అధికారులను ఆదేశించామన్నారు. కొండవాలుతోపాటు లోతట్టు ప్రాంతాల్లో నివాసం ఉంటున్నవారు, శిథిలావస్థకు చేరిన భవనాల్లో నివాసం ఉంటున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు 74 పునరావాస కేంద్రాలను ఏర్పాటుచేశామన్నారు. భారీవర్షాలు, గాలులకు చెట్లు, గోడలు కూలిపోతే వెంటనే తొలగించేందుకు వీలుగా 20 క్విక్ రెస్పాన్స్ బృందాలను ఏర్పాటుచేశామన్నారు. వర్షం కారణంగా పల్లపు ప్రాంతాల్లో నీరు నిలిచిపోకుండా, గెడ్డలు, డ్రెయిన్లలో ప్రవాహానికి ఇబ్బంది లేకుండా క్లియర్ చేసేందుకు 29 జేసీబీలను సిద్ధంగా ఉంచామన్నారు. ముంపు ప్రాంతాల్లో వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉండడంతో స్ప్రేయింగ్ చేసేందుకు 82 యంత్రాలు, 64 ఫాగింగ్ మిషన్లు, 15 జనరేటర్లు సిద్ధంగా ఉంచామన్నారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంతో పాటు అన్ని జోనల్ కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటుచేసి టోల్ ఫ్రీ నంబర్లను అందుబాటులో ఉంచామన్నారు. ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్‌రూమ్ నుంచి నగరంలో పరిస్థితి, వరదనీటి ప్రవాహం, సహాయ చర్యలపై పర్యవేక్షిస్తున్నామన్నారు.

ఏసీబీ వలలో సచివాలయ కార్యదర్శి, ఆర్ఐ

... 5వ పేజీ తరువాయి

గత నెల 12వ తేదీ నుంచి సచివాలయ కార్యదర్శి, ఆర్ఐల చుట్టూ తిరుగుతున్నాడు. అందుకు వారు రూ.60 వేలు లంచం డిమాండ్ చేశారు. అంత ఇవ్వలేనని చెబితే కనీసం రూ.50 వేలు అయినా ఇవ్వాలన్నారు. చివరికి రూ.30 వేలకు ఒప్పందం కుదిరింది. ఈ విషయాన్ని యువకుడు ఏసీబీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లగా వారి సూచన మేరకు సోమవారం సాయంత్రం సచివాలయంలో కార్యదర్శికి డబ్బులు ఇస్తుండగా అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. ఆ సమయంలో ఆర్ఐ రాజు సచివాలయంలో లేకపోవడంతో అతన్ని వేరే ప్రాంతంలో పట్టుకుని అరెస్టు చేసి సచివాలయానికి తీసుకువచ్చారు. ఈ దాడిలో డీఎస్పీ రమణమూర్తితో పాటు ఎస్ఐలు శ్రీనివాసరావు, లక్ష్మణరావు, సుప్రియ పాల్గొన్నారు. కాగా ఫిర్యాదుదారులు తమ పేర్లు బయటకు వెల్లడించవద్దని కోరినట్టు డీఎస్పీ తెలిపారు.


భీమిలి తీరంలో ఉధృతంగా కెరటాలు


రుషికొండ బీచ్‌లో పరిస్థితిని సమీక్షిస్తున్న మెరైన్ ఇన్‌చార్జి ఐజీ గోపీనాథ్‌జెట్టి


నాగమయ్యపాలెం తీరంలో వలలను భద్రపరుస్తున్న మత్స్యకారులు

వణికిస్తున్న మొంథా

- నియోజకవర్గంలోని ఈదురుగాలులు, భారీ వర్షం
- తీర ప్రాంత గ్రామాల్లో పర్యటించిన అధికారులు
- పలుచోట్ల పునరావాస కేంద్రాలు ఏర్పాటు

భీమునిపట్నం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుపాను ప్రభావంతో నియోజకవర్గంలో సోమవారం ఉదయం నుంచి ఈదురు గాలులతో భారీ వర్షాలు కురుస్తున్నాయి. మూడు రోజుల పాటు వర్షాలు కొనసాగుతాయన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. తుపాను బలపడే క్రమంలో సముద్రం అల్లకల్లోలంగా మారి, తీరం వైపు కెరటాలు దూసుకువస్తున్నాయి. మంగమారిపేట, భీమిలి బోయవీధిలో కెరటాల ఉధృతి ఎక్కువగా ఉంది. లోతట్టు ప్రాంతాలైన మంగమారిపేట, చేపలుప్పాడ, బోయవీధి, తోటవీధిని తహశీల్దార్ రామారావు, భీమిలి జోనల్ కమిషనర్ అయ్యప్పనాయుడు, సీఐ తిరుమలరావు సందర్శించి మత్స్యకారులను అప్రమత్తం చేశారు. ఆర్డీవో సంగీత్ మాథూర్ మండల అధికారులతో సాయంత్రం అత్యవసర సమావేశం నిర్వహించారు. బీచ్ రోడ్‌లో మంగమారిపేట హైస్కూల్, చేపలుప్పాడ తుపాను రక్షిత భవనం, భీమిలి ఫిషర్‌మెన్ కాలనీ పాఠశాల, తోటవీధి కల్యాణ మండపం, పోలీసుస్టేషన్ సమీపంలో వున్న జీవీఎంసీ ఉన్నత పాఠశాలను పునరావాస కేంద్రాలుగా ఏర్పాటు చేశారు. అత్యవసర పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని మరిన్ని కేంద్రాలు ఏర్పాటు చేస్తామని ఆర్డీఓ తెలిపారు. మత్స్యకారులు ఇళ్లకే పరిమితం కావాలని, ప్రమాదకర పరిస్థితులు ఎదురైతే వెంటనే అధికారులకు సమాచారం అందించాలని కోరారు. తహశీల్దార్ కార్యాలయం, మునిసిపల్ ఎంపీపీ పాఠశాలలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. భీమిలిలో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు 34. 6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని ఏఎస్‌వో శేషగిరిరావు తెలిపారు.


అధికారులతో సమావేశమైన ఆర్డీవో సంగీత్ మాథూర్

గంభీరం రిజర్వాయర్ పరిశీలన

ఆనందపురం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) :గంభీరం రిజర్వాయర్‌ను మండల ప్రత్యేకాధికారి రామారావు, ఎంపీడీఓ జానకి, తహశీల్దార్ శ్రీనుబాబు పరిశీలించారు. లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురయ్యే అవకాశం ఉండడంతో రిజర్వాయర్ పరిసర ప్రాంతాల పరిస్థితిని స్థానిక ప్రజాప్రతినిధులతో చర్చించారు. ముంపు ప్రమాదం ఉన్న గ్రామాల వివరాలు, రోడ్ల స్థితి, డ్రైనేజీలు వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ప్రత్యేకాధికారి మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి, పలు సూచనలు చేశారు.


రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న అధికారులు


పాండ్రంగిలో గోస్తనీ నది ప్రవాహాన్ని పరిశీలిస్తున్న అధికారులు

లోతట్టు ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు

పద్మనాభం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : పద్మనాభం తహశీల్దారు కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. ముంపునకు గురయ్యే ప్రాంతాలు సామయ్యవలస, మునివానిపేట, పొట్నూరు, పాండ్రంగి, కుర్రపల్లి గ్రామాల్లో తహశీల్దారు ఆనందరావు, సీఐ శ్రీధర్ పర్యటించి, అధికారులకు పలు సూచనలు చేశారు.గోస్తనీ నదిపై రాకపోకలు, స్నానాలు చేయడాన్ని నిషేధిస్తూ పోలీసులు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. కుర్రపల్లి వద్ద ఆనకట్ట వద్ద కూడా స్నానాలు చేయకూడదని బోర్డులు పెట్టారు. పాండ్రంగిలో పంట పొలాలు ముంపునకు గురవడంతో బిబిలీ లేఅవుట్ వద్ద తహశీల్దార్ ఆనందరావు, సీఐ శ్రీధర్ పొక్లెయినరుతో నీరు బయటకు వెళ్లడానికి కాలువ తవ్వించారు. మండల ప్రత్యేకాధికారి జ్ఞానవేణి మండల పరిషత్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అధికారులు అందరూ అందుబాటులో ఉండాలని చెప్పారు. ఎంపీడీఓ రూపేష్, ఏఓ చలం కూడా అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షలు చేస్తున్నారు.

శారదానగర్‌లో జారి పడిన మట్టి పెల్లలు


శారదానగర్‌లో రేకుల షెడ్ వద్ద జారి పడిన మట్టి పెల్లలు

కొమ్మాది, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : శారదానగర్, అయ్యప్పనగర్ కొండవాలు ప్రాంతంలోని మట్టి పెల్లలు జారి పడ్డాయి. ఇక్కడ కొండలను తొలిచి ఇళ్ల నిర్మాణం చేపట్టారు. వర్షాలకు ఇళ్ల కింద మట్టి కొట్టుకుపోయి పునాదులు బలహీనపడి ప్రమాదాలు సంభవిస్తున్నాయి. కొండవాలు ప్రాంతాల్లో రక్షణ గోడలు నిర్మించాలని ప్రజలు ఎప్పటి నుంచో కోరుతున్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదు. కాగా శారదానగర్ కొండపై మూడు రేకుల షెడ్లు దెబ్బతినడంతో చినగదిలి ఆర్ఐ కిశోర్, సచివాలయ సిబ్బంది, టీడీపీ నాయకుడు నమ్మి రమణ పరిశీలించారు. ఈదురుగాలులకు కార్పెంటర్స్ కాలనీ, సాయిరాం కాలనీలో విద్యుత్ తీగలు తెగి పడిపోవడంతో సరఫరాకు అంతరాయం ఏర్పడింది. కార్పొరేటర్ మొల్లి హేమలత అధికారులకు ఫిర్యాదు చేయడంతో వెంటనే సరఫరాను పునరుద్ధరించారు. భారీ వర్షాల నేపథ్యంలో జోన్-2 పరిధిలో పీఎంపాలెం కల్యాణ మండపం, మారికవలస కల్యాణ మండపం, సాగర్‌నగర్‌లోని కల్యాణమండపంలో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు జడ్సీ కనకమహాలక్ష్మి తెలిపారు.

సందర్శకులకు అనుమతి లేదు : ఐజీ

సాగర్‌నగర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ నేపథ్యంలో అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని కోస్టల్ సెక్యూరిటీ పోలీస్ ఇన్‌చార్జి ఐజీ గోపీనాథ్‌జెట్టి సూచించారు. రుషికొండ బీచ్‌ను సోమవారం సందర్శించారు. మత్స్యకారులు వేటకు వెళ్లకుండా చూడాలన్నారు. సందర్శకులను తీరంలోకి అనుమతించవద్దన్నారు. కాగా సాగర్‌నగర్, రుషికొండలో సముద్రం ఉప్పొంగుతోంది. అలలు ముందుకు వచ్చి ఎగిసిపడుతున్నాయి. ముందస్తు చర్యల్లో భాగంగా పోలీసులు సందర్శకులను బీచ్‌లోకి అనుమతించకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు.ఎవరూ బీచ్‌లోకి వెళ్లకుండా పోలీసులు, మెరైన్ పోలీసులు, లైఫ్‌గార్డులు కాపలా కాస్తున్నారు.

పొట్ట దశలో వరి



పద్మనాభం రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : రైతులను తుపాను భయం వెంటాడుతోంది. ప్రస్తుతం వరి పంట పొట్ట దశలో ఉంది. భారీ వర్షాలు పడుతుండడం, మరో మూడు రోజుల పాటు వర్షాలు కొనసాగే అవకాశం ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే లోతట్టు ప్రాంతాల్లో పంట నీట మునిగింది. మద్ది, పద్మనాభం, వీకే పాలెం, బాందేవపురం, కృష్ణాపురం, రెడ్డిపల్లి, తునివలస, కోరాడ, పొట్నూరు తదితర గ్రామాల్లో రైతులు సుమారు 6 813 ఎకరాల్లో వరి వేశారు. ఎకరాకు రూ. 15 వేలు నుంచి రూ. 25 వేల వరకు పెట్టుబడి పెట్టారు. పొట్ట దశలో ఉన్న సమయంలో ఈదురుగాలులు వీస్తే పంట మొత్తం నాశనమయ్యే అవకాశం ఉంది.

తుఫాన్‌ను సమర్థంగా ఎదుర్కోవాలి

విశాఖ, ప్రకాశం కలెక్టర్‌లతో మంత్రి స్వామి టెలికాన్ఫరెన్స్

టంగుటూరు (కొండపి), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్‌ను సమర్థంగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి సూచించారు. అధికారులంతా సమన్వయంతో పని చేయాలన్నారు. సోమవారం సాయంత్రం ఆయన ప్రకాశం జిల్లా తూర్పునాయుడుపాలెంలోని తన క్యాంపు కార్యాలయం నుంచి ప్రకాశం, విశాఖ కలెక్టర్‌లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ముందస్తు జాగ్రత్తలపై సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు తుఫాన్‌పై ఎప్పటికప్పుడు సమీక్ష చేస్తున్నారని అందుకు అనుగుణంగా అధికారులు ఆస్తి, ప్రాణ నష్టం వాటిల్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. అక్కడ ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఆహారం, తాగునీరు, మందులు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలు కూడా అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దని మంత్రి విజ్ఞప్తి చేశారు.

విద్యుత్ సరఫరా తక్షణ పునరుద్ధరణకు చర్యలు

... 5వ పేజీ తరువాయి

11 జిల్లాల అధికారులను రెండు రోజుల ముందుగానే అప్రమత్తం చేశామన్నారు. విద్యుత్ పునరుద్ధరణ చర్యల కోసం సుమారు 15 వేల స్తంభాలు, 950 ట్రాన్స్‌ఫార్మర్లు, 115 క్రేన్లు, 80 జేసీబీలు, 144 వైర్‌లెస్ హ్యాండ్ సెట్లు, 254 పోల్ డ్రిల్లింగ్ యంత్రాలు, మొబైల్ బృందాలను సిద్ధం చేశామన్నారు. తుపాన్ పునరుద్ధరణ పనులు పూర్తయ్యేంత వరకు ఉద్యోగులు అందరికీ సెలవులు రద్దు చేశామని చెప్పారు. ఆపరేషన్స్ డైరెక్టర్ సూర్యప్రకాశ్ కాకినాడ, కోనసీమ జిల్లాల్లో పర్యటిస్తూ అక్కడి అధికారులను సమన్వయం చేస్తున్నారన్నారు. ఇతర జిల్లాల నుంచి సుమారు ఏడు వేల మంది సిబ్బందిని, సామగ్రిని తుపాన్ ప్రభావిత ప్రాంతాలకు తరలించామన్నారు. వారిని సీజీఎం విజయలలిత పర్యవేక్షిస్తున్నారన్నారు. అన్ని జిల్లాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసి అధికారులను అందుబాటులో ఉంచామన్నారు.

అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దు

... 5వ పేజీ తరువాయి

సూచించారు. శ్రీకాకుళం నుంచి ఉమ్మడి గోదావరి జిల్లాల వరకు 1,058 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామని, 32467 మందిని తరలించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. సహాయక చర్యల నిమిత్తం పదకొండు ఎస్డీఆర్ఎఫ్ బృందాలు రంగంలోకి దిగాయన్నారు. పదమూడు వేల విద్యుత్ స్తంభాలను అందుబాటులో ఉంచామన్నారు. కోస్తా తీరంలోని అన్ని జిల్లాల అధికారులను అప్రమత్తం చేశామన్నారు. రాబోయే 38 నుంచి 46 గంటలు అత్యంత కీలకమని, ప్రజలు చాలా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

శివాలయాల్లో కార్తీక పూజలు


భీమిలి మండలంలోని నగరపాలెం శివాలయంలో పూజలు


సింహగిరిపై కాశీవిశ్వేశ్వరునికి పూజలు చేస్తున్న భక్తులు

నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లోనూ శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కార్తీక మాసం మొదటి సోమవారం కావడంతో భక్తులు వేకువజాము నుంచే ఆలయాల వద్ద బారులు తీరారు. స్వామివారికి దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

- భీమునిపట్నం రూరల్, సింహాచలం, ఆంధ్రజ్యోతి

భీమిలిలో తొమ్మిది పునరావాస కేంద్రాలు

భీమునిపట్నం (రూరల్), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) :మండలంలో తొమ్మిది పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశామని తహశీల్దార్ రామారావు తెలిపారు. వీటి నిర్వహణ కోసం వీఆర్ఓలు, పోలీసులు, రెవెన్యూ సిబ్బందిని నియమించామని చెప్పారు.చిన నాగమయ్యపాలెం, పెద నాగమయ్యపాలెం, ఎర్రయ్యపాలెం, మూలకుద్దు, మంగమారిపేట, చేపలుప్పాడ, బోయివీధి, తోటవీధి కల్యాణ మండపం, చిన్నబజారు మునిసిపల్ స్కూల్‌లో కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు.

సింహగిరిపై కుండపోత

సింహాచలం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : సింహగిరిపై సోమవారం ఉదయం నుంచి వర్షం కురుస్తూనే ఉంది. దట్టమైన మేఘాలు కమ్ముకోవడంతో చీకటి అలముకుంది. ఘాట్‌రోడ్డులో వాహనదారులు పగలు కూడా లైట్లు వేసుకుని రాకపోకలు సాగించారు.


సింహగిరిపై వర్షం

సురక్షిత ప్రాంతాలకు వెళ్లండి : ఆర్డీవో

భీమునిపట్నం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆర్డీఓ సంగీత్ మాథూర్ కోరారు. సోమవారం రాత్రి ఆయన తన కార్యాలయంలో మండల అధికారులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. తీర ప్రాంతంలో ప్రజలు ఉండకూడదని, తక్షణమే పునరావాస కేంద్రాలకు తరలివెళ్లాలని ఆదేశించారు. కేంద్రాల్లో వసతి, ఆహారం, వైద్య సదుపాయం ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా తీసుకోవలసిన చర్యలపై అధికారులతో చర్చించారు.సహాయం కోసం 8309020063, 8074425598 కంట్రోల్ రూమ్ నంబర్లను సంప్రతించాలన్నారు. అంతకముందు ఆయన గోస్తనీ పరీవాహక గ్రామాలు నగరపాలెం, చిట్టివలస తగరపువలస, మూలకుద్దులో తహశీల్దార్ రామారావుతో కలిసి పర్యటించారు. నదిలో నీరు ఎక్కువైతే ముంపునకు గురయ్యే ప్రాంతాలను గుర్తించారు. అనంతరం నది ప్రవాహ వేగాన్ని పరిశీలించారు.

రెవెన్యూ సిబ్బంది అందుబాటులో ఉండాలి

పద్మనాభం రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : గోస్తనీ నదిలో నీటి ప్రవాహం పెరిగే అవకాశం ఉందని, నది పరీవాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ ఆనందరావు సూచించారు. సోమవారం ఆయన పొట్నూరు గ్రామం వద్ద నది నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడం వల్ల గ్రామస్తులు నది వద్దకు వెళ్లరాదని సూచించారు. ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉన్నందున రెవెన్యూ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సీఐ శ్రీధర్ కూడా పలు గ్రామాల్లో పర్యటించారు.


బోయవీధిలో మత్స్యకారులతో మాట్లాడుతున్న తహసీల్దార్ రామారావు

అప్రమత్తంగా ఉండాలి

- శిథిల భవనాలు, గోడల విషయంలో ముందస్తు చర్యలు చేపట్టాలి
- జిల్లా అధికారులతో ప్రత్యేకాధికారి, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ సమీక్ష సమావేశం

విశాఖపట్నం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తుపాన్ నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, చిన్నపాటి దుర్ఘటన కూడా జరగడానికి వీలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ప్రత్యేకాధికారి, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ ఆదేశించారు. సోమవారం జిల్లాకు వచ్చిన ఆయన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలోకలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, ఇతర విభాగాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ శిథిల భవనాలు, గోడలను ముందుగానే గుర్తించి ప్రమాద నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు. గాలుల తీవ్రతకు హోర్డింగ్‌లు కూలిపోయే ప్రమాదముందని, ముందుగానే వాటిని తొలగించాలన్నారు.తుఫాన్ దిశ మారవచ్చునని, మంగళవారం ఉదయం నుంచి గాలుల తీవ్రత పెరుగుతుందన్నారు. ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉండే ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, అక్కడ అవసరమైన తాగునీరు, ఆహారం, చిన్నపిల్లలకు పాలు, మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు ప్రాంతాల వారీగా సిబ్బందిని అందుబాటులో ఉంచాలని సూచించారు.

29న టిఫిన్, భోజనం ప్యాకెట్లు సిద్ధం చేసుకోవాలి

సోమవారం రాత్రి తుఫాన్ తీరం దాటే అవకాశం ఉందని, ఆ సమయంలో గంటకు 100 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని అజయ్‌జైన్ అన్నారు. ఈ ప్రభావంతో చాలాచోట్ల నష్టం వాటిల్లవచ్చునన్నారు. ఆయా ప్రాంతాల్లో 29వ తేదీ ఉదయం, మధ్యాహ్నం టిఫిన్, భోజనం ప్యాకెట్లు అందించాలన్నారు. పడిపోయిన విద్యుత్ స్తంభాలను డ్రోన్‌లతో గుర్తించి తక్షణమే సహాయక చర్యలు చేపట్టాలన్నారు. కలెక్టర్ హరేంధిరప్రసాద్ మాట్లాడుతూ తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. కొండవాలు ప్రాంతాల్లో ఉన్న సుమారు 12,755 ఇళ్లలో 96 ప్రమాదకరంగా ఉన్నాయని, ఆ ఇళ్లలో ఉంటున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించామన్నారు. తుఫాన్ షెల్టర్లు 20, పునరావాస కేంద్రాలు 23 ఉన్నాయని, వాటిల్లో 9,290 మంది ఉండేందుకు వసతులు కల్పిస్తున్నామన్నారు. విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో 430 బృందాలు పనిచేస్తున్నాయన్నారు. నేవీ, కోస్ట్‌గార్డ్ అధికారులతో మాట్లాడి తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. తీరంలో ఆరు మెకనైజ్డ్ బోట్లు, హెలికాప్టర్‌లను సిద్ధంగా ఉంచామన్నారు. జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ మాట్లాడుతూ అదనంగా 38 పునరావాస కేంద్రాలను, 20 క్విక్ రెస్పాన్స్ టీమ్‌లను ఏర్పాటు చేశామని, ఒక్కో జోన్‌లో రెండేసి బృందాలు ఉంటాయన్నారు.

వాకర్స్, విజిటర్స్‌కు నో ఎంట్రీ

ఎంవీపీ కాలనీ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : తుపాన్ నేపథ్యంలో అధికారుల ముందస్తు చర్యల్లో భాగంగా వీఎమ్మార్డీఏ హెల్త్ ఎరీనా, అప్పుఘర్ వద్ద లుంబినీ పార్కులకు ప్రవేశాలను నిలిపేశారు. ప్రతి రోజూ హెల్త్‌ఎరీనాకు వందలాది మంది వాకర్స్ వస్తుంటారు. ఇక్కడ దారి పొడవునా చెట్లు ఉన్నాయి. ఎలాంటి ప్రమాద పరిస్థితులు ఎదురుకాకుండా ఉండేందుకు మంగళవారం, బుధవారం వాకర్స్‌ను రాకుండా మూసేశారు. లుంబినీ పార్కులోకి కూడా సందర్శకులను అనుమతించడం లేదు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆరిలోవ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఆరిలోవ సబ్‌స్టేషన్ పరిధిలో సోమవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం వాటిల్లింది. సబ్ స్టేషన్‌లో ఇన్సులేషన్ పూర్తిగా పాడవడంతో సరఫరాకు ఇబ్బందులు వచ్చాయని ఏఈ తెలిపారు. వర్షం కురవడంతో తగిన జాగ్రత్తలు తీసుకుని మరమ్మతులు చేసినట్లు తెలిపారు.

వాకర్స్‌కు వైద్య పరీక్షలు

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : అక్వార్‌దాస్ మైదానంలో వీఎస్సీ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మెడికవర్ ఆసుపత్రి సిబ్బంది వాకర్స్‌కు బీపీ, మధుమేహ పరీక్షలు నిర్వహించారు. అసోసియేషన్ ప్రతినిధులు డాక్టర్ పప్పూర్ నికుంజ్, జాలీ వాకర్ తదితరులు పాల్గొన్నారు.

గోవులను తరలిస్తున్న వ్యాన్లు సీజ్

ఆరిలోవ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : ధారపాలెం నుంచి ఆరిలోవకు ఎనిమిది ఆవులను రెండు వ్యాన్‌ల్లో తరలిస్తుండగా స్థానికులు శ్రీకృష్ణాపురం వద్ద సోమవారం రాత్రి పట్టుకొని పోలీసులకు అప్పగించారు. సీఐ మల్లేశ్వరరావు తెలిపిన వివరాలు ప్రకారం.. ఆరిలోవకు చెందిన ఎండీ అబ్దుల్లా, బాతిన్ అలమండ సంతలో ఆవులను కొనుగోలు చేసినట్టు వ్యాన్ డ్రైవర్లు రాంబాబు, శ్రీరాములు తెలిపారు. డ్రైవర్లతో పాటు ఆవులను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్టు సీఐ చెప్పారు.

మేహాద్రిగెడ్డ నుంచి నీటి విడుదల



గోపాలపట్నం,అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మేహాద్రిగెడ్డకు ఇన్‌ఫ్లో పెరగింది. ఆదివారం సాయంత్రానికి రిజర్వాయర్ నీటిమట్టం 59.7 అడుగులుండగా సోమవారం ఉదయానికి 59.9 అడుగులకు చేరింది. ఈ నేపథ్యంలో 1,058 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. రిజర్వాయర్‌ను పెందుర్తి తహసీల్దార్ ఐ.వెంకట అప్పారావు, ఆర్ఐ హరి ప్రసన్న, ఇరిగేషన్ ఏఈఈ పి.నళిని, వర్క్ ఇన్‌స్పెక్టర్ సుబ్బరాజు పరిశీలించి సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

సినిమా గైడ్

- **బైసన్** : శారదా.
- **తమ్మా** : రమాదేవి
- **డూడ్** : శరత్, శ్రీరామా, లీలామహల్, శ్రీకన్య, ఎస్.వి.సి.లలిత (శ్రీహరిపురం), లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)
- **క్రాంప్** : సంగం, కామేశ్వరి, వెంకటేశ్వర-1, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం),
- **ఓజీ** : జిన్నార, కామేశ్వరి, శ్రీకన్య హెవెన్-3, మినీ మోహిని (గాజువాక), శ్రీకాంతి, సుకన్య,
- **మిరాయి** : సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 17, టమాటా 30, వంకాయలు (తెలుపు) 52, వంకాయలు (నలుపు) 52, బెండకాయలు 42, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 38, బీరకాయలు 40, ఆనపకాయ 24, కాలీఫ్లవర్ 40, క్యాబేజీ 26, క్యారెట్ 66, దొండకాయలు 44, బంగాళ దుంపలు 20, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 74, అల్లం (పాతది) 70, బరబాటి 46, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 50, బద్దచిక్కుడు 66, దోస కాయలు 28, వెల్లుల్లి (పెద్దవి) 65, కొబ్బరికాయ (పెద్దది) 40, బీన్స్ (పెన్సిల్) 70, కీరదోస 20, కాప్సికమ్ 70, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 34, చిలగడదుంపలు 34, కంద 48, దేముడు చిక్కుడు 70, గోరు చిక్కుడు 42, కూర పెండలం 36, బ్రకోలి 45, పనస పొట్టు 200, కొండఉసిరి 64, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 22, మామిడి అల్లం 90, బొప్పాయి 32, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	565
విజయనగరం	569
శ్రీకాకుళం	569

చికెన్ ధరలు	
బ్రాయిలర్	
రైతు ధర	115
లైవ్ ధర	135
విత్ స్కిన్	240
స్కిన్‌లెస్	250





చెట్టు పడిపోవడంతో ఎంవీపీ రైతు బజారు వద్ద రహదారిలో ప్రయాణాలు నిలిపేసిన పోలీసులు



అధికారులను అప్రమత్తం చేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి

తెరిపివ్వని వాన

- తుఫాను ప్రభావంతో భారీగా కురుస్తున్న వర్షం
- ఈదురుగాలులకు పలుచోట్ల కూలిన చెట్లు
- లోతట్టు ప్రాంతాలు జలమయం

ఎంవీపీ కాలనీ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పచ్చని చెట్లతో అలరారే ఎంవీపీ కాలనీకి చిన్నపాటి గాలులు వచ్చినా ప్రమాదం పొంచి ఉంటుంది. చెట్ల కొమ్మలు విరిగిపడటం, పెద్ద వృక్షాలు నేలకొరిగిపోవడం ఇక్కడ సాధారణం. సోమవారం ఉదయం కురిసిన వర్షానికే ఎంవీపీ డబుల్ రోడ్డులోని విద్యుత్తు శాఖ కార్యాలయం ఎదురుగా భారీ వృక్షం నేలకొరిగింది. అదృష్టవశాత్తూ ఎవరికీ ఏమీ కాలేదు. ఓ పక్క రోడ్డులో పూర్తిగా రాకపోకలు నిలిచిపోయాయి. ఈ సంఘటన మినహా ఎంవీపీలోని పలు ప్రాంతాల్లో చిన్న చిన్న కొమ్మలు మాత్రమే విరిగిపోయాయి. అవకాశం ఉన్నచోట కొమ్మలను జీవీఎంసీ సిబ్బంది తొలగిస్తున్నారు. విద్యుత్తు కార్యాలయ సిబ్బంది కూడా అప్రమత్తంగా ఉన్నారు. మంగళవారం గాలుల తీవ్రత ఎక్కువగా ఉంటుందన్న హెచ్చరికల నేపథ్యంలో స్థానికుల్లో ఆందోళన నెలకొంది. సోమవారం సాయంత్రం కురిసిన వర్షానికి ఎంవీపీ డబుల్ రోడ్డులో కొన్ని చోట్ల మోకాళ్ల లోతులో నీరు నిలిచిపోయింది.

వర్షం నీటితో నిండిన రోడ్లు

ఆరిలోవ : రెండు రోజులుగా కురుస్తున్న సాధారణ వర్షంతో పాటు తుపాన్ ప్రభావం వల్ల ఆరిలోవ ప్రాంతంలో రోడ్లు వర్షపు నీటితో నిండిపోయాయి. చిరువ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కూలి పనులు లేక శ్రమజీవులు విలవిలలాడుతున్నారు. కొండ ప్రాంత వాసులు భయపడుతున్నారు. హుద్ హుద్ తుఫాన్‌ను గుర్తు చేసుకుని ఆందోళన చెందుతున్నారు.



జలమయమైన హెచ్‌బీకాలనీ ప్రధాన రహదారి

ఎమ్మెల్యే వెలగపూడి నిరంతర పర్యవేక్షణ

ఎంవీపీ కాలనీ : మొంథా తుపాన్ నేపథ్యంలో ఎలాంటి నష్టం జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టంగా చెప్పిన నేపథ్యంలో తన నియోజకవర్గంలో అందరూ అప్రమత్తంగా ఉండేందుకు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఎంవీపీ కాలనీలోని తన కార్యాలయంలో అందుబాటులో ఉంటూ అధికారులందరితో నిరంతరం మాట్లాడుతున్నారు. వివిధ విభాగాల అధికారులు, వార్డుల పరిధిలోని ముఖ్య నాయకులతో చర్చిస్తున్నారు. ఏ ప్రాంతాల్లో సామాజిక భవనాలు అందుబాటులో ఉన్నాయి, లేని చోట ప్రయివేటు కల్యాణమండపాలు తీసుకుని, వాటికి విద్యుత్తు సరఫరా నిలిచిపోయినా, ఎలాంటి ఇబ్బందులు లేకుండా జనరేటర్ల ఏర్పాటు విషయంలో స్థానిక నాయకులు అధికారులకు సహకరించేలా తగిన ఆదేశాలు, సూచనలు ఇస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో చెట్లు పడిపోయినా, విద్యుత్తు సమస్యలు, ఇతరత్రా ఏ ఇబ్బంది వచ్చినా, వార్డుల్లోని నాయకుల ద్వారా సమాచారం తెలుసుకుంటున్నారు. వెంటనే సంబంధిత సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నారు. వార్డుల్లోని పార్టీ నాయకులు, అధికారులను సమన్వయపరుస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో తుపాన్ బాధితులను సమీపంలోని సామాజిక భవనాల్లోకి తరలించడమే కాకుండా, వారికి అవసరమైతే ఆహారం అందించడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఎక్కడ ఏం జరిగినా తనకు సమాచారం అందించాలని వార్డులోని కింది స్థాయి నాయకులు, కార్యకర్తలకు సూచించారు.

చెరువులను తలపిస్తున్న రహదారులు

వెంకోజీపాలెం : నగరంలో సోమవారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు రోడ్లు జలమయమైపోయాయి. సాధారణ వర్షం కురిస్తేనే 15వ వార్డులోని హెచ్‌బీకాలనీ స్టీల్‌ప్లాంట్ మెయింటెనెన్స్ ఆఫీసు వద్ద ప్రధాన రహదారి చెరువును తలపిస్తుంది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి నీరు నిలిచిపోయి వాహనచోదకులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మిగిలిన ప్రాంతాల్లోని రోడ్లు, వీధులలోనూ వర్షపు నీరు నిలిచిపోయి చెరువులను తలపించింది.



కొత్త వెంకోజీపాలెం ఆలయంలో అభిషేకం చేస్తున్న అర్చకులు, పాల్గొన్న భక్తులు





పెదవాల్తేరులో కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో భక్తుల పూజలు

భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు

వెంకోజీపాలెం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): శివ నామ స్మరణతో శైవాలయాలు మార్మోగాయి. 'హరహర మహాదేవ శంభో శంకర' అంటూ శివుడ్ని కొలిచారు. కార్తీక మాసం మొదటి సోమవారం కావడంతో శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శివునికి అత్యంత ప్రీతిపాత్రమైన కార్తీక మాసంలో అభిషేకాలు, పూజలు నిర్వహించుకుంటే మంచి జరుగుతుందనే ఆలోచనతో తెల్లవారుజాము నుంచే ఆలయాలకు చేరుకున్నారు.

కొత్తవెంకోజీపాలెంలో..

కొత్తవెంకోజీపాలెంలోని జ్ఞానానంద ఆశ్రమం దేవదాయ, ధర్మాదాయ శాఖ అజమాయిషీలోని గౌరీ జ్ఞాన లింగేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశేష సంఖ్యలో హాజరైన భక్తులకు ఆలయ ప్రధాన అర్చకులు ఆరవెల్లి సూర్యప్రకాష్ శర్మ ఆధ్వర్యంలో ఎ.రామకృష్ణ శర్మ, పి.సుబ్రహ్మణ్యేశ్వర శాస్త్రి, పి.బాల భాస్కరశర్మ, ప్రభాకరశర్మ, సాయి శర్మ తదితరులు గోత్రనామాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. భక్తుల పేరిట రుద్రాభిషేకాలు జరిపారు. మహిళలంతా అత్యంత భక్తి శ్రద్ధలతో కుటుంబ సమేతంగా ఆలయానికి విచ్చేసి పూజలు నిర్వహించుకున్నారు. దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఆటంకం కలుగకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు. సాయంత్రం మహిళలు ఇంటి వద్ద నుంచి దూదితో తయారుచేసిన ఒత్తులతో ధ్వజ స్తంభం వద్ద ఆకాశ జ్యోతిని వెలిగించారు. దేవస్థానం ఈవో బండారు ప్రసాద్, ఇతర సిబ్బంది భక్తులకు ఎటువంటి ఆటంకం కలగకుండా చర్యలు తీసుకున్నారు. వీరికి గ్రామ సేవా సంఘం అధ్యక్షుడు ఆదారి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి పీల ప్రేమ్‌కిరణ్ జగదీష్, సభ్యులు సహకారాలు అందించారు.

హెచ్‌బీకాలనీ శివాలయంలో..

హెచ్‌బీకాలనీలోని శివాలయంలో కార్తీక మొదటి సోమవారం పూజలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి విచ్చేసి అభిషేకాలు నిర్వహించారు. మహిళలు ఇక్కడి ధ్వజస్తంభం, రాగి చెట్టు, తులసి కోట వద్ద దీపారాధన చేశారు.



మద్దిలపాలెంలో ఉమామహేశ్వరునికి పూజలు

త్రిమూర్తిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో..

ఎంఎంటీసీ కాలనీ త్రిమూర్తిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాసం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలోనున్న ధ్వజస్తంభం వద్ద ఆకాశజ్యోతులు వెలిగించారు. ఆలయ కార్యదర్శి సావిత్రి, కోశాధికారి సుబ్బారాయుడు తదితరులు పాల్గొన్నారు. ఇసుకతోటలోని శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అత్యంత భక్తి శ్రద్ధలతో భక్తులు శివుని పూజలో పాల్గొని, ప్రసాదాన్ని స్వీకరించారు. కేఆర్ఎం కాలనీలోని శివాలయానికి భక్తులు పోటెత్తారు. కార్తీక సోమవారం సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. మహిళలు ధ్వజస్తంభం వద్ద దీపాలు వెలిగించారు.

ఆరిలోవలో..

ఆరిలోవ : ఓం నమః శివాయ అనే పంచాక్షరీ మంత్రంతో శివాలయాలు మారుమోగాయి. వేకువ జాము నుంచి భక్తులు క్యూ కట్టారు . శివ లింగానికి వివిధ రకాల పవిత్ర జలాలతో అభిషేకాలు నిర్వహించారు. విభూది, పంచామృతాలు, నారికేళ జలాలతో ముక్కంటిని అభిషేకించారు. అనంతరం మారేడు దళాల (బిల్వ పత్రం)తో పూజ నిర్వహించారు. పెదగదిలిలోగల కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర ఆలయం, ఆరిలోవ డ్రైవర్స్‌కాలనీలో వెలసిన బాల త్రిపుర సుందరి సహిత మల్లేశ్వర స్వామి ఆలయం, శివాజీనగర్‌లోని జ్యోతిర్లింగేశ్వర ఆలయం, చినగదిలి షిర్డీ సాయిబాబా ఆలయంలోగల స్ఫటిక లింగేశ్వరునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. వర్షంలోనూ భక్తులు శివ పూజలో పాల్గొన్నారు.

కాశీవిశ్వేశ్వరుని ఆలయంలో..

పెదవాల్తేరు:పెదవాల్తేరులోని కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయం తెల్లవారుజాము నుంచి భక్తులతో కిటకిటలాడింది. ఆలయంలో స్వామివారికి పూజలు, అభిషేకాలు నిర్వహించి, ప్రసాదం పంపిణీ చేశారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ చైర్‌పర్సన్ సీహెచ్ జ్యోతి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ప్రధాన అర్చకులు కాశీ ప్రసాద్, కమిటీ సభ్యుడు అప్పారావు పాల్గొన్నారు.

మద్దిలపాలెంలో..

మద్దిలపాలెం : ఉమామహేశ్వర పంచాయతన ఆలయంలో కార్తీక మాసం తొలి సోమవారం పూజలు ఘనంగా జరిగాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు దీపారాధన చేశారు. ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తున్నా స్వామి వారి దర్శనానికి భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. భక్తిశ్రద్ధలతో శివలింగానికి పాలు, పంచామృతాలతో అభిషేకం చేశారు. ఉత్సవ కమిటీ చైర్మన్ అచ్చి రమేష్‌రెడ్డి, అధ్యక్షుడు కాకి గోపాల్‌రెడ్డి, అర్చకులు గాయత్రి శర్మ పూజలను పర్యవేక్షించారు.

ఏయూలో ట్రాన్స్‌లేషన్ మెడిసిన్‌పై జాతీయ సదస్సు

విశాఖపట్నం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఏయూ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ట్రాన్స్‌లేషన్ మెడిసిన్ ఇన్ కేన్సర్ టీఎంసీ-2025 అనే అంశంపై సోమవారం జాతీయ సదస్సు ప్రారంభించారు.ఏయూ టీఎల్ఎన్ సభా హాల్‌లో నిర్వహించిన ఈ సదస్సును వ్యాస్ కేన్సర్ రీసెర్చ్ పార్క్ సీఈవో డాక్టర్ ఎం. కులకర్ణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాన్స్‌లేషన్ అంకాలజీ ప్రాధాన్యతను వివరించారు. ఏయూ వీసీ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ మాట్లాడుతూ భవిష్యత్‌లో వివిధ సంస్థలతో అవగాహన ఒప్పందాలు చేసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఇండ్రాస్ ప్రైవేటు లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ శ్రీధర్ ఓలేటి, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎంవీఆర్ రాజు సదస్సు కన్వీనర్ పి. రాధిక, పాల్గొన్నారు.

సమగ్ర రక్షిత మంచినీటి పథకం పరిశీలన

పద్మనాభం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఐనకలపాలెం గోస్తనీ నదిపై ఉన్న రక్షిత మంచినీటి పథకాన్ని జడ్పీ సీఈఓ. నారాయణమూర్తి సోమవారం పరిశీలించారు. 18 గ్రామాలకు తాగునీరు అందించే ఈ పథకం తుపాను వల్ల విద్యుత్ లేకపోయినా పనిచేసేవిధంగా జనరేటర్ ఏర్పాటు చేసింది లేనిది పరిశీలించారు. జనరేటరును అందుబాటులో ఉంచామని అధికారులు ఆయనకు చెప్పారు. తాగునీటికి ఇబ్బందులు రాకుండా చూడాలని ఆయన అధికారులను ఆదేశించారు.



సిబ్బందితో మాట్లాడుతున్న సీఈఓ

కళాకారులు విశ్వసమైక్యతకు వారధులు

- నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి

వెంకోజీపాలెం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మన దేశ సాంస్కృతిక సంపద ఆదర్శనీయమైనదని నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి పేర్కొన్నారు. సోమవారం 15వ వార్డు డాక్టర్స్ కాలనీలోని ఏపీఎస్ఈబీ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కాన్ఫరెన్స్ హాల్లో స్కూల్ ఆఫ్ థియేటర్స్, ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం సంయుక్తంగా నిర్వహించిన జాతీయ కళాకారుల సత్కార కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కళాకారుల ప్రతిభకు ఎల్లలు ఉండవన్నారు. విశ్వసమైక్యతకు కళాకారులే వారధులని చెప్పారు. మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ మాట్లాడుతూ జానపద కళారూపాలను పరిరక్షించుకునే బాధ్యత అందరిదన్నారు. బాజపా మహిళా నాయకురాలు బాగాది శ్యామల మాట్లాడుతూ మన సాంప్రదాయ కళలు విశ్వఖ్యాతిని ఆర్జిస్తున్నాయన్నారు. ఇంటర్నేషనల్ వాకర్స్ అవార్డు గ్రహీత డాక్టర్ కమల్ బెయిడ్ మాట్లాడుతూ విశాఖలో క్రీడా, సాంస్కృతిక రంగాల్లో ప్రతిభావంతులకు కొదవ లేదన్నారు. జిల్లా కళాకారుల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు జి.శ్రీనుబాబు మాట్లాడుతూ విశాఖ సాంస్కృతిక ప్రదర్శనలకు ప్రభుత్వ వేదిక అవసరమన్నారు. బ్రహ్మకుమారి రామేశ్వరి, స్కూల్ ఆఫ్ థియేటర్ ఆర్ట్స్ అంతర్జాతీయ కొరియోగ్రాఫర్ ఆర్.నాగరాజు పట్నాయక్‌లు మాట్లాడుతూ విశాఖలో వివిధ దేశాల జానపద నృత్య సమ్మేళనం ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా వెస్ట్ బెంగాల్, విశాఖ నుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయి ప్రదర్శనలు ఇచ్చిన కళాకారులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో కొండ్రు రామారావు, బి. గురునాథరావు, బాగాది ప్రవల్లిక నాయుడు, కుమారి తదితరులు పాల్గొన్నారు. అనంతరం కళాకారులు జానపద నృత్యాలతో అలరించారు.



సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులతో సీపీ శంఖబ్రత బాగ్చి, నిర్వాహకులు



పేరుకుపోయిన చెత్త

అధ్వానంగా పారిశుధ్యం

రామ్‌నగర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఓ వైపు గోతులు తవ్విన రోడ్డు, వర్షంతో మురికి కాలువలు పొంగి గోతులలో చేరుతున్నాయి. మరో వైపు పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేక ఎక్కడ పడితే అక్కడ చెత్తతో రామ్‌నగర్ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 28వ వార్డులో పారిశుధ్య సమస్య ఇబ్బందికరంగా ఉంది. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కోసం రోడ్డు తవ్విన జీవీఎంసీ సిబ్బంది ఇప్పటి వరకు పూడ్చలేదు. వర్షాలు కురుస్తుండడంతో ప్రజలకు తీవ్ర అసౌకర్యంగా ఉంది. పారిశుధ్య నిర్వహణ కూడా అధ్వానంగా ఉంది. రహదారిపై వ్యర్థాలు తొలగించటంలో 28వ వార్డు పారిశుధ్య విభాగం తీవ్ర అలసత్వం చూపుతోంది. జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న రామ్‌నగర్ బజారు సెంటర్‌తో పాటు పలు చోట్ల చెత్త తొలగించడం లేదు. ఒక్క రోజులోనే పెద్దఎత్తున చెత్త చేరుతోంది. దీనితో ఈగలు, దోమలు విజృంభిస్తున్నాయి. అసలే వర్షాలు పడుతుండటం, పారిశుధ్యం అస్తవ్యస్తంగా ఉండటంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి పారిశుధ్య పరిస్థితి మెరుగుపరచాలని స్థానికులు కోరుతున్నారు.

ఘనంగా అయ్యప్ప ఆలయ వార్షికోత్సవం

ఆరిలోవ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): చినగదిలిలోని షిర్డీ సాయిబాబా ఆలయంలోగల వినాయక, అయ్యప్ప, కుమార స్వామి ఆలయ వార్షికోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. వేద మంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ దేవతామూర్తులకు విశేష పూజలు చేశారు. ఈ సందర్భంగా మాలధారణ చేసిన స్వాములకు 48 రోజులు మధ్యాహ్నం (భిక్ష) అన్న ప్రసాద వితరణ జరుపనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ వానపల్లి అప్పారావు తెలిపారు. సుమారు 200 మంది మాలధారులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ వాది పావనమూర్తి కన్నుమూత



పావనమూర్తి (ఫైల్)

సీతంపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ అంబేడ్కర్ వాది చింతకాయల పావన మూర్తి (93) సోమవారం ఉదయం సీతమ్మధార లోని అంబేడ్కర్‌నగర్‌లో కన్ను మూశారు. నగరంలోని రామాటాకీస్ సమీపంలో అంబేడ్కర్ భవన్‌ను స్థాపించిన వారిలో ఆయన ప్రముఖులు. బీఆర్ అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీకి సుదీర్ఘ కాలం ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. అంబేడ్కర్ సామాజిక సిద్ధాంతాన్ని విస్తృతం చేయడంలో ఆయన ఎంతో కృషి చేశారు. సర్వ మానవ సమానత్వాన్ని కోరిన బుద్ధిజం అభివృద్ధికి ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఆయన చేసిన కృషి ఎంతో ఉంది. రాష్ట్రంలో బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా రాష్ట్ర శాఖ స్థాపించి ప్రథమ అధ్యక్షుడిగా పనిచేశారు. ఆయన మృతిపట్ల పలువురు ప్రముఖులు సంతాపం తెలియచేశారు. మంగళవారం ఉదయం 10 గంటలకు కేఆర్ఎం కాలనీలోని శ్మశాన వాటికలో ఆయన పార్థివ దేహానికి అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

ఆర్పీఎఫ్ కానిస్టేబుల్‌పై దాడి చేసిన వ్యక్తిపై కేసు

విశాఖపట్నం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఉన్న ఆర్పీఎఫ్ కానిస్టేబుల్‌పై దాడికి పాల్పడిన వ్యక్తికి రైల్వే చట్టం ప్రకారం కోర్టు జరిమానా విధించింది. ఆర్పీఎఫ్ శాఖ ఇచ్చిన సమాచారం మేరకు సోమవారం తెల్లవారుజాము 3.30 గంటల ప్రాంతంలో నాల్గో నంబరు ప్లాట్‌ఫామ్‌పై ఆర్పీఎఫ్ కానిస్టేబుల్ ఎస్.కె.మిథర్వాల్ తనిఖీ నిర్వహిస్తున్న సమయంలో ప్రయాణికులు కూర్చునే బెంచీపై ఓ వ్యక్తి నిద్రపోవడాన్ని గమనించారు. అతడిని మేల్కొలిపి ఇక్కడ కూర్చునే నదుపాయం తప్ప నిద్రపోకూడదని వారించారు. దీంతో ఆ వ్యక్తి ఆగ్రహంతో ఆర్పీఎఫ్ కానిస్టేబుల్‌పై వాగ్వివాదానికి దిగి దాడికి ప్రయత్నించాడు. సమాచారం తెలుసుకున్న ఆర్పీఎఫ్ ఎస్ఐ కీర్తిరెడ్డి అతడిని ఆర్పీఎఫ్ పోస్టుకు తీసుకువచ్చి సీసీ కెమెరాల ద్వారా పరిశీలించగా దాడికి పాల్పడినట్టు తేలింది. దీంతో రైల్వే చట్టం ప్రకారం కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా జరిమానా విధించింది.

రైల్వేస్టేషన్‌లో గంజాయి పట్టివేత

విశాఖపట్నం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : రైల్లో గంజాయి రవాణా చేస్తున్న మహిళను ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది పట్టుకుని రూ.పది వేల విలువ చేసే రెండు కిలోల గంజాయి సంచులను స్వాధీనం చేసుకున్నారు. సోమవారం ప్లాట్‌ఫామ్‌లపై తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో ఒడిశాకు చెందిన బినోదిని..బెంగళూరుకు గంజాయి రవాణా చేస్తూ దొరికిపోయిందని, కేసు నమోదు చేసి కోర్టుకు తరలించామని రైల్వే పోలీసులు తెలిపారు.

వ్యర్థాల ఉత్పత్తిని నియంత్రించాలి

విశాఖపట్నం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): వ్యర్థాల ఉత్పత్తిని వీలైనంత వరకు నియంత్రించాలని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ పుదుచ్చేరి డైరెక్టర్ ఎంఎం గంగేర్కర్ అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా పర్యావరణశాస్త్ర విభాగం గోల్డెన్ జూబ్లీ వేడుకల సందర్భంగా సోమవారం ప్లాటినమ్ జూబ్లీ సమావేశ మందిరంలో నిర్వహించిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను ఆయన ప్రారంభించారు. ఎంపవరింగ్ ఎన్విరాన్‌మెంటల్ స్టీవర్డ్‌షిప్ (ఈఈఎస్)- 2025 (సస్టైనబులిటీ ఏజ్ టూల్ ఫర్ రిస్క్ రిడక్షన్) అంశంపై మాట్లాడారు. ఉష్ణోగ్రతలు సముద్ర మట్టాల పెరుగుదలకు కారణమవుతున్నాయని గ్రహించాలన్నారు. జీవ వైవిధ్యం దెబ్బతినకుండా చూడాల్సిన బాధ్యతపై ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. భూగోళం జీవనానికి నిరుపయోగంగా మారకుండా చూడాలన్నారు. భారత భూ విజ్ఞానశాస్త్ర విభాగం నుంచి ఏయూకు సహకారాన్ని అందిస్తామన్నారు. ఏయూ వీసీ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ మాట్లాడుతూ మానవ ప్రవర్తనలో మార్పు రావాలన్నారు. పర్యావరణ పరిరక్షణ నిరంతర ప్రక్రియ కావాలన్నారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎంవీఆర్ రాజు విభాగాధిపతి, సదస్సు కన్వీనర్ ప్రొఫెసర్ పి.సుభాషిణి ప్రొఫెసర్లు వి. హేమశైలజ, కె.వీరభద్రం, రిటైర్డ్ ప్రొఫెసర్లు ఏజే సాల్మన్ రాజు, ఈయూబీ రెడ్డి, టి.భైరాగిరెడ్డి, ప్రసాదరావు, రాజశేఖర్, పాలక మండలి సభ్యులు ప్రొఫెసర్ బి.సుజాత తదితరులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ లలిత భాస్కరికి అభినందనలు

విశాఖపట్నం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఏయూ కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ డి. లలిత భాస్కరికి విద్యారత్న పురస్కారం లభించిన సందర్భంగా వీసీ ప్రొఫెసర్ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ సోమవారం తన కార్యాలయంలో అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఇటీవల హైదరాబాదులోని టీ హబ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో భారత్ ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్ అవార్డు-2025 వేడుకల్లో భాగంగా ఏపీసీటీఈ సీఈవో డాక్టర్ బుద్ధా చంద్రశేఖర్, జేఎన్‌టీయూకే కాకినాడ వీసీ ప్రొఫెసర్ జీవీఆర్‌కే ప్రసాద్ ఈ పురస్కారాన్ని లలిత భాస్కరికి ప్రదానం చేశారు.

పోర్టులో విజిలెన్స్ వారోత్సవాలు

విశాఖపట్నం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం పోర్టు అథారిటీ సోమవారం విజిలెన్స్ వారోత్సవాలను ఘనంగా ప్రారంభించింది. పోర్టు పరిపాలనా భవనం సాంబమూర్తి ఆడిటోరియంలో పోర్టు అథారిటీ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ అరుణప్రసాద్ ఉత్సవాలు ప్రారంభించారు. అనంతరం అధికారులు, సిబ్బందితో విజిలెన్స్ ప్రమాణం చేయించారు.

ముగిసిన తిరు నక్షత్ర పూజలు

సింహాచలం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో ఐదు రోజులుగా జరుగుతున్న మనవాళ్ల మహామునుల తిరు నక్షత్ర పూజలు సోమవారంతో పూర్తయ్యాయి. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తి చేశారు. ఉత్సవ మూర్తి గోవిందరాజస్వామిని, ఉభయదేవేరులను, ఆళ్వార్లను ఆలయ ఆస్థాన మండపంలో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. స్థానాచార్యులు రాజగోపాల్ పర్యవేక్షణలో అధ్యాపకులు నాలాయిర దివ్యప్రబంధంలోని పాశురాలను అనుసంధానం చేశారు. రాజభోగ నివేదనం వేళ తిరు నక్షత్ర చాత్తు పఠించి స్వామివారికి నీరాజనాలిచ్చారు.

అప్రమత్తంగా ఉండాలి

- శిథిల భవనాలు, గోడల విషయంలో ముందస్తు చర్యలు చేపట్టాలి
- హోర్డింగ్‌లు, విరిగేందుకు అవకాశం ఉన్న చెట్లకొమ్మలను తొలగించాలి
- జిల్లా అధికారులతో ప్రత్యేకాధికారి అజయ్‌జైన్

విశాఖపట్నం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, చిన్నపాటి దుర్ఘటన కూడా జరగడానికి వీలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ప్రత్యేకాధికారి, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ ఆదేశించారు. సోమవారం జిల్లాకు వచ్చిన ఆయన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, ఇతర విభాగాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిథిల భవనాలు, గోడలను ముందుగానే గుర్తించి ప్రమాద నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు. గాలుల తీవ్రతకు హోర్డింగ్‌లు కూలిపోయే ప్రమాదముందని, ముందుగానే వాటిని తొలగించాలని ఆదేశించారు. తుఫాన్ దిశ మారవచ్చునని, మంగళవారం ఉదయం నుంచి గాలుల తీవ్రత మరింత పెరుగుతుందన్నారు. ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉండే ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, అక్కడ అవసరమైన తాగునీరు, ఆహారం, చిన్నపిల్లలకు పాలు, మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు ప్రాంతాల వారీగా సిబ్బందిని అందుబాటులో ఉంచాలని సూచించారు.

29న టిఫిన్, భోజనం ప్యాకెట్లు సిద్ధం చేసుకోవాలి

సోమవారం రాత్రి తుఫాన్ తీరం దాటే అవకాశం ఉందని, ఆ సమయంలో గంటకు 100 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని అజయ్‌జైన్ అన్నారు. ఈ ప్రభావంతో చాలాచోట్ల నష్టం వాటిల్లవచ్చునన్నారు. నష్టం వాటిల్లిన ప్రాంతాల్లో 29వ తేదీ ఉదయం, మధ్యాహ్నం టిఫిన్, భోజనం ప్యాకెట్లు అందించాలన్నారు. పడిపోయిన విద్యుత్ స్తంభాలను డ్రోన్‌లతో గుర్తించి తక్షణమే సహాయక చర్యలు చేపట్టాలని అజయ్‌జైన్ ఆదేశించారు. కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ మాట్లాడుతూ తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. కొండవాలు ప్రాంతాల్లో సుమారు 12,755 ఇళ్లు ఉన్నాయని, వాటిలో 96 ప్రమాదకరంగా ఉన్నాయని, ఆ ఇళ్లలో ఉంటున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించామన్నారు. తుఫాన్ షెల్టర్లు 20, పునరావాస కేంద్రాలు 23 ఉన్నాయని, వాటిల్లో 9,290 మంది ఉండేందుకు వసతులు కల్పిస్తున్నామన్నారు. విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో 430 బృందాలు పనిచేస్తున్నాయన్నారు. నేవీ, కోస్ట్‌గార్డ్ అధికారులతో మాట్లాడి తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. తీరంలో ఆరు మెకనైజ్డ్ బోట్లు, హెలికాప్టర్‌లను సిద్ధంగా ఉంచామన్నారు. జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ మాట్లాడుతూ జిల్లా యంత్రాంగంతో కలిసి అదనంగా 38 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. 20 క్విక్ రెస్పాన్స్ టీమ్‌లను ఏర్పాటు చేశామని, ఒక్కో జోన్‌లో రెండేసి బృందాలు ఉంటాయన్నారు.

రాకపోకలకు అవస్థలు

వర్షానికి అక్కయ్యపాలెం, శ్రీనివాసనగర్, దొండపర్తి, రైల్వేన్యూకాలనీ, తాటిచెట్లపాలెం, నరసింహనగర్ తదితర ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీలు జలమయమై రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

కూలిన ప్రహరీ గోడలు, చెట్లు


సుభాష్‌నగర్‌లో పాఠశాల ప్రహరీ గోడ కూలిన ప్రాంతాన్ని పరిశీలించి సూచనలు చేస్తున్న పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు

కంచరపాలెం/ఆర్పీపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ నేపథ్యంలో సోమవారం కురిసిన వర్షాలు, ఈదురుగాలులకు జీవీఎంసీ 57వవార్డు పరిధి సుభాష్ నగర్‌లో గల ప్రాథమిక పాఠశాల ప్రహరీ గోడ కూలిపోయింది. పాఠశాలలకు ప్రభుత్వం సెలవులు ప్రకటించడంతో పెనుముప్పు తప్పింది. పాఠశాల వెనుక గల ప్రధాన గెడ్డను ఆనుకుని ఉన్న ప్రహరీ గోడ మొత్తం కూలిపోవడంతో గోపాలపట్టణం మండల విద్యాశాఖాధికారులు అంబటి సోమేశ్వరరావు, డి.దివాకర్‌లు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. నష్టాన్ని జిల్లా విద్యాశాఖాధికారికి తెలియజేశారు. సంబంధిత వార్డు ఎమినిటీ సెక్రటరీ ద్వారా జరిగిన నష్టాన్ని అంచనా వేయించి ఉన్నతాధికారులకు తెలియజేశారు.ప్రహరీ గోడ పడిపోవడంతో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ఎమ్మెల్యే గణబాబు పరిశీలన...

సుభాష్ నగర్ ప్రాథమిక పాఠశాల ప్రహరీ గోడ పూర్తిగా కూలిపోవడంతో స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు జోరువానలో ఘటనా స్థలాన్ని పరిశీలించారు.సంబంధిత అధికారులతో మాట్లాడి తీసుకోవలసిన చర్యలను నిర్దేశించారు. ఈ కార్యక్రమంలో వార్డు టీడీపీ అధ్యక్షుడు పెంటకోట అజయ్‌బాబు, కార్పొరేటర్ ముర్రువాణి నానాజీ, గిరి రాజు, సేనాపతి సురేష్, దేవి ,దివ్య, బుజ్జి పాల్గొన్నారు.

సత్యసాయినగర్‌లో కూలిన చెట్టు

అక్కయ్యపాలెం: తుఫాన్ కారణంగా ఈదురు గాలికి, కుండపోత వర్షానికి 45వ వార్డు కొండ ప్రాంతం సత్యసాయినగర్‌లో చెట్టు కూలిపోయింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. టీడీపీ నాయకులు వెళ్లి కూలిన చెట్టును పరిశీలించారు.

కూలిన శ్మశానవాటిక ప్రహరీ గోడ

జ్ఞానాపురం: తుఫాన్ ప్రభావంతో జీవీఎంసీ 41వ వార్డు పరిధిలోని కాన్వెంటు కూడలి శ్మశానవాటిక ప్రహరీ గోడ కూలిపోయింది. జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ సిబ్బంది జడ్సీ బి.రాము ఆదేశాలతో భారతీ, సత్తిబాబు ఆధ్వర్యంలో సహాయక చర్యలు చేపట్టారు. ఈ ప్రహరీ హోల్‌సేల్ మార్కెట్‌కు ఆనుకొని ఉండడం, ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. జ్ఞానాపురంలోని లోతట్టు ప్రాంతాల్లో వర్షం నీరు నిలిచిపోకుండా ఎర్రిగెడ్డలో పూడికలు తొలగించారు. పారిశుధ్య, ఇంజనీరింగ్ సిబ్బంది సహాయ చర్యలు చేపడుతున్నారు.


కూలిన శ్మశానవాటిక ప్రహరీ గోడ వద్ద పనులు చేయిస్తున్న ఇంజనీరింగ్ ఉద్యోగిని

తుఫాన్‌ను సమర్థంగా ఎదుర్కోవాలి

- విశాఖ, ప్రకాశం కలెక్టర్‌లతో మంత్రి స్వామి టెలికాన్ఫరెన్స్

టంగుటూరు (కొండపి), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తుఫాన్‌ను సమర్థంగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి సూచించారు. అధికారులంతా సమన్వయంతో పని చేయాలన్నారు. సోమవారం సాయంత్రం ఆయన ప్రకాశం జిల్లా తూర్పునాయుడుపాలెంలోని తన క్యాంపు కార్యాలయం నుంచి ప్రకాశం, విశాఖ కలెక్టర్‌లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ముందస్తు జాగ్రత్తలపై సమీక్షించారు. సీఎం చంద్రబాబు తుఫాన్‌పై ఎప్పటికప్పుడు సమీక్ష చేస్తున్నారని అందుకు అనుగుణంగా అధికారులు ఆస్తి, ప్రాణ నష్టం వాటిల్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. అక్కడ ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఆహారం, తాగునీరు, మందులు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలు కూడా అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దని మంత్రి విజ్ఞప్తి చేశారు.

పునరావాస కేంద్రాలకు కొండవాలు ప్రాంతాల వాసులు

... 5వ పేజీ తరువాయి

పునరావాస కేంద్రాలకు తరలించాలని నిర్ణయించామన్నారు. జీవీఎంసీ పరిధిలో 135 ప్రాంతాల్లో 14,431 కుటుంబాలు కొండవాలు ప్రాంతాల్లో నివాసం ఉంటున్నాయని, అందులో ఐదుచోట్ల 249 కుటుంబాలకు ముప్పుపొంచి ఉందని భావిస్తున్నామన్నారు. వారితోపాటు మధ్యస్థ ముప్పు కలిగివున్న ప్రాంతాల్లోని కుటుంబాలను కూడా పునరావాస ప్రాంతాలకు తరలించాలని అధికారులను ఆదేశించామన్నారు. కొండవాలుతోపాటు లోతట్టు ప్రాంతాల్లో నివాసం ఉంటున్నవారు, శిథిలావస్థకు చేరిన భవనాల్లో నివాసం ఉంటున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు 74 పునరావాస కేంద్రాలను ఏర్పాటుచేశామన్నారు. భారీవర్షాలు, గాలులకు చెట్లు, గోడలు కూలిపోతే వెంటనే తొలగించేందుకు వీలుగా 20 క్విక్ రెస్పాన్స్ బృందాలను ఏర్పాటుచేశామన్నారు. వర్షం కారణంగా పల్లపు ప్రాంతాల్లో నీరు నిలిచిపోకుండా, గెడ్డలు, డ్రెయిన్లలో ప్రవాహానికి ఇబ్బంది లేకుండా క్లియర్ చేసేందుకు 28 జేసీబీలను సిద్ధంగా ఉంచామన్నారు. ముంపు ప్రాంతాల్లో వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉండడంతో స్ప్రేయింగ్ చేసేందుకు 82 యంత్రాలు, 64 ఫాగింగ్ మిషన్లు, 15 జనరేటర్లు సిద్ధంగా ఉంచామన్నారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయం, అన్ని జోనల్ కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటుచేసి టోల్ ఫ్రీ నంబర్లను అందుబాటులో ఉంచామన్నారు. ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్‌రూమ్ నుంచి నగరంలో పరిస్థితి, వరదనీటి ప్రవాహం, సహాయ చర్యలపై పర్యవేక్షిస్తున్నామన్నారు.

ఏసీబీ వలలో సచివాలయ కార్యదర్శి, ఆర్‌ఐ

... 5వ పేజీ తరువాయి

గత నెల 12వ తేదీ నుంచి సచివాలయ కార్యదర్శి, ఆర్‌ఐల చుట్టూ తిరుగుతున్నాడు. అందుకు వారు రూ.60 వేలు లంచం డిమాండ్ చేశారు. అంత ఇవ్వలేనని చెబితే కనీసం రూ.50 వేలు అయినా ఇవ్వాలన్నారు. చివరికి రూ.30 వేలకు ఒప్పందం కుదిరింది. ఈ విషయాన్ని యువకుడు ఏసీబీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లగా వారి సూచన మేరకు సోమవారం సాయంత్రం సచివాలయంలో కార్యదర్శికి డబ్బులు ఇస్తుండగా అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. ఆ సమయంలో ఆర్‌ఐ రాజు సచివాలయంలో లేకపోవడంతో అతన్ని వేరే ప్రాంతంలో పట్టుకుని అరెస్టు చేసి సచివాలయానికి తీసుకువచ్చారు. ఈ దాడిలో డీఎస్పీ రమణమూర్తితో పాటు ఎస్‌ఐలు శ్రీనివాసరావు, లక్ష్మణరావు, సుప్రియ పాల్గొన్నారు. కాగా ఫిర్యాదుదారులు తమ పేర్లు బయటకు వెల్లడించవద్దని కోరినట్టు డీఎస్పీ తెలిపారు.

విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు చర్యలు

... 5వ పేజీ తరువాయి

11 జిల్లాల అధికారులను రెండు రోజుల ముందుగానే అప్రమత్తం చేశామన్నారు. విద్యుత్ పునరుద్ధరణ చర్యల కోసం సుమారు 15 వేల స్తంభాలు, 950 ట్రాన్స్‌ఫార్మర్లు, 115 క్రేన్లు, 80 జేసీబీలు, 144 వైర్‌లెస్ హ్యాండ్ సెట్లు, 254 పోల్ డ్రిల్లింగ్ యంత్రాలు, మొబైల్ బృందాలను సిద్ధం చేశామన్నారు. తుఫాన్ పునరుద్ధరణ పనులు పూర్తయ్యేంత వరకు ఉద్యోగులు అందరికీ సెలవులు రద్దు చేశామని చెప్పారు. ఆపరేషన్స్ డైరెక్టర్ సూర్యప్రకాశ్ కాకినాడ, కోనసీమ జిల్లాల్లో పర్యటిస్తూ అక్కడి అధికారులను సమన్వయం చేస్తున్నారన్నారు. ఇతర జిల్లాల నుంచి సుమారు ఏడు వేల మంది సిబ్బందిని, సామగ్రిని తుఫాన్ ప్రభావిత ప్రాంతాలకు తరలించామన్నారు. వారిని సీజీఎం విజయలలిత పర్యవేక్షిస్తున్నారన్నారు. అన్ని జిల్లాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసి అధికారులను అందుబాటులో ఉంచామన్నారు.

ఆర్టీసీకి ఎఫెక్ట్

... 5వ పేజీ తరువాయి

ప్రకటించారు. మధ్యాహ్నం నుంచి రాత్రి 8.00 గంటలమధ్య దూర ప్రాంతాలకు బయలుదేరిన బస్సులను ట్రాకింగ్ సిస్టమ్ ద్వారా ద్వారకా కాంప్లెక్స్‌లోని కంట్రోలర్లు పర్యవేక్షిస్తున్నారు.

60 శాతం ఓఆర్‌కే పరిమితం

మిగిలిన బస్సుల సగటు ఆక్యుపెన్సీ రేషియో 60 శాతంగా నమోదయ్యింది. సాధారణ రోజుల్లో 85 నుంచి 90 శాతం ఉన్న ఆక్యుపెన్సీ రేషియో సోమవారం 60 శాతానికి పడిపోయింది. రీజియన్‌లో ప్రస్తుతం 740 షెడ్యూల్ సర్వీసులు ఉండగా, అందులో 60 రద్దు చేయగా మిగిలిన 680 సర్వీసులు నడిపినా ఆక్యుపెన్సీ రేషియో పెద్దగా లేదు. మంగళవారం కూడా ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

ఘాట్ రోడ్లు, గుంతల రోడ్లలో బస్సులు నడపొద్దు

- బి.అప్పలనాయుడు, రీజనల్ మేనేజర్

ఘాట్‌రోడ్లు, వర్షం నీటితో నిండిన గుంతల రోడ్లలో బస్సులు నడపవద్దని డ్రైవర్లకు ఆర్టీసీ రీజనల్ మేనేజర్ ఆదేశాలు జారీచేశారు. అలాంటి పరిస్థితి ఉంటే బస్సులను అందుబాటులో ఉన్న ఆర్టీసీ డిపోలో నిలిపివేయాలని సూచించారు. సంబంధిత సమాచారాన్ని ఆర్‌ఎం కార్యాలయంలోని కంట్రోల్ రూమ్‌కు చేరవేయాలని సూచించారు. ఎక్కడా రిస్క్ తీసుకోవద్దు, ప్రయాణికులను ప్రమాదంలోకి నెట్టవద్దని డ్రైవర్లకు సూచించారు.

విశాఖ జిల్లాకు రెడ్ అలర్ట్

... 5వ పేజీ తరువాయి

నంబరు డేంజర్ సిగ్నల్ ఎగురవేశారు. దీంతో పోర్టులో వాణిజ్య కార్యకలాపాలు నిలిపివేశారు. బుధవారం తుఫాన్ తీరం దాటేంత వరకు పోర్టుల్లో డేంజర్ సిగ్నల్స్ కొనసాగే అవకాశం ఉంది.

ముసురు

తుఫాన్ జిల్లాపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఆదివారం రాత్రి నుంచే వర్షాలు ప్రారంభమయ్యాయి. సోమవారం రాత్రి వరకూ కురుస్తూనే ఉన్నాయి. గాలులకు చెట్ల కొమ్మలు విరిగి రోడ్లకు అడ్డంగా పడుతున్నాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతోంది. మురుగు కాలువల్లో పూడికలు, చెత్త తొలగించకపోవడంతో ఈ వర్షాలకు అవన్నీ రోడ్లపైకి చేరుతున్నాయి. అనేకచోట్ల అండర్ గ్రౌండ్ డ్రైనేజీకి చెందిన మ్యాన్‌హోళ్ల నుంచి నీరు పైకి ఎగజిమ్ముతోంది.

ఆరోగ్య శాఖ అప్రమత్తం

తుఫాన్ నేపథ్యంలో ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. జిల్లాలోని అర్బన్ హెల్త్ సెంటర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సిబ్బంది నిరంతరం సేవలు అందించాలని అధికారులు ఆదేశించారు. సోమవారం సాయంత్రం ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు నిర్వహించిన సమీక్షా సమావేశంలో జిల్లా యంత్రాంగానికి కీలక ఆదేశాలను జారీచేశారు. అందుకు అనుగుణంగా జిల్లా అధికారులు క్షేత్రస్థాయి సిబ్బందిని అప్రమత్తం చేశారు. మంగళవారం నుంచి వైద్యులు విధులు నిర్వర్తిస్తున్న ప్రాంతంలోనే ఉండాలని సూచించారు. అలాగే తుఫాన్ ప్రభావం అధికంగా ఉంటుందని గుర్తించిన 66 ప్రాంతాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటుచేయాలని సిబ్బందికి ఆదేశాలు ఇచ్చారు. నగర పరిధిలోని అర్బన్ హెల్త్ సెంటర్లు కూడా 24 గంటలు తెరిచే ఉంచాలని, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఆరోగ్య కేంద్రాల్లో తప్పనిసరిగా యాంటీ స్నేక్ వీనం, ఓఆర్ఎస్, ఏఆర్‌వీ, ఐవీ ఫ్లూయిడ్స్‌ను సిద్ధంగా ఉంచుకోవాలని స్పష్టంచేశారు.

బోట్ క్లినిక్‌లుగా వాహనాలు

జిల్లాకు కేటాయించిన ఏడు 104, మరో 16 అంబులెన్స్‌లు (108), 23 తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్ (102 వాహనాలు)లను తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో మత్స్యశాఖ అధికారులతో కలిసి బోట్ క్లినిక్స్‌గా ఏర్పాటుచేస్తున్నారు. పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ పరిధిలో ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లను ఏర్పాటు చేసుకుని డాక్టర్, పారామెడికల్ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు సూచించారు.

అంబేడ్కర్ వాది పావనమూర్తి కన్నుమూత


పి.పావనమూర్తి (ఫైల్)

సీతంపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ అంబేడ్కర్ వాది చింతకాయల పావనమూర్తి (93) సోమవారం ఉదయం సీతమ్మధారలోని అంబేడ్కర్‌నగర్‌లో కన్ను మూశారు. నగరంలోని రామ టాకీస్ సమీపంలో అంబేడ్కర్ భవన్‌ను స్థాపించిన వారిలో ఆయన ప్రముఖులు. బీఆర్ అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీకి సుదీర్ఘ కాలం ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా రాష్ట్ర శాఖ స్థాపించి ప్రథమ అధ్యక్షుడిగా పనిచేశారు. ఆయన మృతిపట్ల పలువురు ప్రముఖులు సంతాపం తెలియచేశారు. మంగళవారం ఉదయం 10 గంటలకు కేఆర్‌ఎం కాలనీలోని శ్మశాన వాటికలో ఆయన పార్థివ దేహానికి అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబసభ్యులు తెలిపారు.

ఆర్పీఎఫ్ కానిస్టేబుల్‌పై దాడి చేసిన వ్యక్తిపై కేసు

విశాఖపట్నం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఉన్న ఆర్పీఎఫ్ కానిస్టేబుల్‌పై దాడికి పాల్పడిన వ్యక్తికి రైల్వే చట్టం ప్రకారం కోర్టు జరిమానా విధించింది. సోమవారం తెల్లవారుజామున ఆర్పీఎఫ్ కానిస్టేబుల్ ఎస్.కె.మిథర్వాల్ తనిఖీ నిర్వహిస్తున్న సమయంలో ప్రశ్నించిన ఆర్పీఎఫ్ కానిస్టేబుల్‌పై ఆగ్రహంతో దాడికి ప్రయత్నించాడు. ఎస్‌ఐ కీర్తిరెడ్డి సీసీ కెమెరాల ద్వారా పరిశీలించగా దాడికి పాల్పడినట్టు తేలింది. దీంతో కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా జరిమానా విధించింది.

అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దు

... 5వ పేజీ తరువాయి

సూచించారు. శ్రీకాకుళం నుంచి ఉమ్మడి గోదావరి జిల్లాల వరకు 1,058 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామని, 32467 మందిని తరలించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. సహాయక చర్యల నిమిత్తం పదకొండు ఎన్డీఆర్ఎఫ్ బృందాలు రంగంలోకి దిగాయన్నారు. పదమూడు వేల విద్యుత్ స్తంభాలను అందుబాటులో ఉంచామన్నారు. కోస్తా తీరంలోని అన్ని జిల్లాల అధికారులను అప్రమత్తం చేశామన్నారు. రాబోయే 38 నుంచి 46 గంటలు అత్యంత కీలకమని, ప్రజలు చాలా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

నేడు భారీగా రైళ్లు రద్దు

... 5వ పేజీ తరువాయి

ఎక్స్‌ప్రెస్ (18447), రూర్కెలా-జగదల్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌లు (18107) రాయగడ వరకు నడిచేలా గమ్యాలను కుదించారు.

సోమవారం యథావిధిగా బయలుదేరిన రైళ్లు

తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా సోమవారం రద్దు చేసిన రైళ్లను తిరిగి పునరుద్ధరించామని రైల్వే అధికారులు ప్రకటించారు. విశాఖ-తిరుపతి స్పెషల్ (08583), విశాఖ-తిరుపతి డబుల్ డెక్కర్ (22707), విశాఖ-మచిలీపట్నం (17220), విశాఖ-హైదరాబాద్ గోదావరి ఎక్స్‌ప్రెస్ (12727), విశాఖ-మహబూబ్‌నగర్ ఎక్స్‌ప్రెస్ (12861), విశాఖ-చెన్నై సెంట్రల్ (22869), విశాఖ-సికింద్రాబాద్ గరీబ్‌రథ్ (12739), విశాఖ-న్యూఢిల్లీ ఏపీ ఎక్స్‌ప్రెస్ (20806), విశాఖ-ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ (18519) వంటి ఒరిజినేటింగ్ రైళ్లతోపాటు గుంటూరు-రాయగడ ఎక్స్‌ప్రెస్ (17243), రాయగడ-గుంటూరు ఎక్స్‌ప్రెస్ (17244) సోమవారం యథావిధిగా ఒరిజినేటింగ్ స్టేషన్ల నుంచి బయలుదేరాయి.


సీతంపేటలోని పార్వతీశ్వరాలయంలో శివుడికి పాలాభిషేకం చేస్తున్న అర్చకస్వాములు, తిలకిస్తున్న భక్తులు




రెడ్డికంచరపాలెం ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

అంతటా శివనామస్మరణ


కార్తీక తొలిసోమవారం సందర్భంగా అల్లిపురం వేంకటేశ్వర మెట్ట వద్ద మొక్కజొన్న పొత్తులతో చూడముచ్చటగా గౌరీపరమేశ్వరుల అలంకరణ

సీతంపేట/మురళీనగర్/కంచరపాలెం/అల్లిపురం/డాబాగార్డెన్స్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పవిత్ర కార్తీకమాసం తొలి సోమవారం శైవాలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. ఓం నమశ్శివాయ అన్న పంచాక్షరి మంత్రం జపిస్తూ భక్తులు పరమశివుడ్ని కొలిచారు. పూజలు, అభిషేకాలు చేశారు. బిల్వపత్రం, పుష్పాలు సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు. సాయంత్రం ఆయా ఆలయాల్లో ధ్వజస్తంభాల వద్ద దీపాలు వెలిగించారు. వర్షం కురుస్తున్నా లెక్కచేయకుండా పెద్దసంఖ్యలో విచ్చేసిన భక్తులు శివ దర్శనం చేసుకున్నారు. ఆలయాల్లో అర్చకులు భక్తుల గోత్రనామాలతో పూజలు చేసి ఆశీర్వచనాలిచ్చారు. సీతంపేట పార్వతీశ్వరాలయం, సీతమ్మధార నక్కవానిపాలెంలోని ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయం, రెడ్డికంచరపాలెం, తిక్కవానిపాలెం, గంగన్న నగర్, గొల్లకంచరపాలెం, ఊర్వశి జంక్షన్, తుమ్మడిపాలెం, ఐటీఐ జంక్షన్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. డీఎల్‌బీ క్వార్టర్స్ వైర్లెస్ కాలనీ, జ్ఞానాపురం, గవర కంచరపాలెం గౌరీపరమేశ్వర ఆలయాల్లో భక్తులు బారులుతీరారు. డాబాగార్డెన్స్‌లోని శివరామకృష్ణ దేవాలయంలో ఉమా చంద్రమౌళీశ్వర స్వామివారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. మాధవధార కొండమీది భ్రమరాంబిక మల్లికార్జునస్వామి ఆలయంలో ముక్కంటికి పంచామృతాభిషేకాలు, విశేష హారతి నిర్వహించారు. మాధవధార, మర్రిపాలెం, మురళీనగర్ ఎన్‌జీజీవోస్ కాలనీల నుంచి వచ్చిన భక్తులతో మాధవధార పుణ్యక్షేత్రం కిక్కిరిసింది. సహజ జలధారల వద్ద స్నానాలు ఆచరించే వారితో మరింత రద్దీ నెలకొంది. మాధవధార హైస్కూలు దగ్గరి శివాలయం, బర్మాక్యాంప్ మహాశివుని ఆలయం, సత్యానగర్ శ్రీ కాశీ విశ్వేశ్వరస్వామి దేవస్థానాల్లో కార్తీక శోభ నెలకొంది.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

సీతమ్మధార, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు సోమవారం బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని బీజేపీ కార్యాలయంలో పలువురికి అందజేశారు. 55వ వార్డుకు చెందిన దివ్య కవల పిల్లలకు, 48వ వార్డులో నాగేశ్వరరావుకు రూ.5 లక్షల చెక్కులను అందచేశారు. బీజేపీ, టీడీపీ నాయకులు శ్యామల దీపిక, నజీర్, సురేష్‌బాబు, ఈతలపాక సుజాత పాల్గొన్నారు.

'సైనిక పాఠశాల ప్రవేశాల వయో పరిమితిని మార్చుచేయాలి'

కంచరపాలెం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): సైనిక పాఠశాలల్లో ఆరో తరగతిలో ప్రవేశాలకు నిర్దేశించిన వయోపరిమితిని మార్చి 31కి బదులు జూలై నెలకు మార్చాలని యువ సమ్మేళనం సభ్యులు కె.అభిమన్యు డిమాండ్ చేశారు. కంచరపాలెం బీఎస్‌ఆర్ భవనంలో సోమవారం సమావేశం నిర్వహించారు. మార్చి 31ను వయో పరిమితిగా పరిగణించడం వలన చాలా మందికి నిరుపయోగంగా మారుతుందన్నారు. జూలై ఒకటో తేదీగా మార్చితే ఆంధ్రప్రదేశ్‌లో పేద విద్యార్థులకు మేలు జరుగుతుందన్నారు. తల్లిదండ్రులు, సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా చిన్నతల్లి ట్రస్ట్ వార్షికోత్సవం


మహిళలకు చీరలు అందజేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

అల్లిపురం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 33వ వార్డులో సోమవారం విల్లూరి చిన్నతల్లి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు విల్లూరి చక్రవర్తి, తిరుమలదేవి ఆధ్వర్యంలో 18వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ హాజరై మహిళలు, వృద్ధులకు చీరలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సేవా కార్యక్రమాలను ఎమ్మెల్యే వంశీకృష్ణ కొనియాడారు.

నవంబరు 30న వైజాగ్ మారథాన్

మహారాణిపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): నవంబరు 30న నిర్వహించనున్న సంధ్యా మెరైన్స్ వైజాగ్ మారథాన్ టీ షర్ట్‌ను హోటల్ నోవాటెల్‌లో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విచ్చేసిన పలువురు ప్రతినిధుల సమక్షంలో అధ్యక్షుడు బాలకృష్ణారాయ్ మాట్లాడుతూ ఒక మంచి పరుగు మన మనసును శుభ్రపరచి సహజ ఉల్లాసాన్ని కలిగిస్తుందని, నగరం అంతటా ఆరోగ్యాన్ని ప్రోత్సహించేందుకు, మాదక ద్రవ్య రహిత విశాఖ కోసం పరుగు ప్రారంభిద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కృష్ణప్రసాద్, కె.ఆనంద్, రవి కట్టా, టీపీఎస్ సత్యమూర్తి, కంచేటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువుల పంపిణీ


సరుకులు అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి

మహారాణిపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మాజీ శాసనసభ్యుడు వాసుపల్లి గణేష్‌కుమార్ సూచించారు. 35వ వార్డు లక్ష్మీనగర్ వెలంపేట, లోతట్టు ప్రాంతాల్లోని పలు కుటుంబాలకు నిత్యావసర వస్తువులను సోమవారం అందజేశారు. వాసుపల్లి మాట్లాడుతూ తుఫాన్ సమయంలో నిత్యావసర వస్తువుల కోసం లోతట్టు ప్రాంతాల ప్రజలు బయటకు రాకుండా ఉండాలనే ఉద్దేశంతో బియ్యం, కూరగాయలు, మాంసం, వంటనూనె అందించామని తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సమయంలో రాజకీయాలు చేసే ఉద్దేశం లేదన్నారు. మత్స్యకారులకు ప్రభుత్వం 50 కేజీల బియ్యం, రేషన్ ఉచితంగా అందించాలని కోరారు.

సహకార జీవనంతో శాంతి సాధ్యం


సమావేశంలో మాట్లాడుతున్న కె.సుభద్ర

సీతంపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో యునైటెడ్ రిలీజియన్స్ ఇనీషియేటివ్ (యుఆర్‌ఐ) ఆధ్వర్యంలో విద్యావేత్త నరవ ప్రకాశరావు అధ్యక్షతన సర్వమత ప్రార్థనలు, శాంతి అనే అంశంపై సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా విచ్చేసిన యుఆర్‌ఐ రాష్ట్ర కో-ఆర్డినేటర్ కె.సుభద్ర మాట్లాడుతూ సర్వమతాల పట్ల సమభావం, సహకారంతో జీవించడం, శాంతిని కలిగి ఉండడం, మానవ హక్కుల సాధనకు కృషి చేయడం తమ ఆశయాలుగా పేర్కొన్నారు. యువతకు వీటిపై ప్రేరణ కలిగించేందుకు ప్రణాళికలు తయారు చేస్తున్నామన్నారు. ముందుగా సర్వమత ప్రార్థనలు చేశారు. ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ శాంతి ప్రతిజ్ఞ చేశారు. ఈ సమావేశంలో నగర శాఖ కో-ఆర్డినేటర్ విశాలాక్షి, అనురాధ, అహ్మద్ మున్నర్, ప్రభు, జాన్సీ, సాంత్వన సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

వర్షంలోనూ సదస్సు పనులు


డివైడర్‌పై మొక్కలు నాటుతున్న మహిళలకు వసతులు కల్పించాలని సూచిస్తున్న ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

విశాఖపట్నం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెలలో జరగనున్న పెట్టుబడిదారుల భాగస్వామ్య సదస్సు కోసం తుఫాన్ వర్షాలలోను అధికారులు పనులు చేయిస్తున్నారు. రుషికొండలో పర్యాటక శాఖ భవనం ఎదురుగా డివైడర్‌పై సోమవారం వర్షంలో తడుస్తూ దాదాపు పది మంది మహిళలు మొక్కలు నాటే పనుల్లో నిమగ్నమయ్యారు. రెయిన్ కోట్లు వేసుకుని మరీ పనిచేస్తుండటంతో అటు వైపుగా వెళుతున్న ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు అక్కడ ఆగి వారితో మాట్లాడారు. జీవీఎంసీ అధికారులకు ఫోన్ చేసి వర్షం రెండు రోజులు ఆ పనులు ఆపి తరువాత చేపడితే బాగుంటుందని సూచించారు. ఈ వర్షంలో మొక్కలు నాటినా ప్రయోజనం ఉండదన్నారు. మహిళలు వర్షంలో తడవకుండా జాగ్రత్తలు తీసుకుని, వారికి అవసరమైన సదుపాయాలు కల్పించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు.


పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే గణబాబు

భక్తిశ్రద్ధలతో ఛట్ పూజ

మల్కాపురం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): శ్రీహరిపురం అన్నపూర్ణనగర్, సరస్వతి మైదానం, త్రినాథ్ పురం ప్రాంతాల్లో ఉత్తర భారతీయులు సోమవారం ఛట్ పూజను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ విప్, పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే పి.గణబాబు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉత్తర భారతీయులు తమ కుటుంబాలతో పాల్గొని పూజలు చేశారు.

రౌడీషీటర్లపై బైండోవర్

పెందుర్తి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): పెందుర్తి పోలీసుస్టేషన్ పరిధిలో ఉన్న 12 మంది రౌడీ షీటర్లపై బైండోవర్ విధించామని సీఐ కేవీ సతీశ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రౌడీషీటర్లపై ముందస్తు చర్యల్లో భాగంగా మండల మెజిస్ట్రేట్ (తహశీల్దార్) ఎదుట వారిని హాజరు పరిచి ఒక్కొక్కరికి రూ.3 లక్షల పూచీకత్తు బాండ్ విధించామని తెలిపారు. ఆరునెలల్లో మంచిగా మెలిగక పోతే బాండ్‌లో ఉన్న నగదు కోర్టులో జమ చేస్తామని సీఐ తెలిపారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం


రోడ్డు పక్కన నిలిపివేసిన బస్సు

సింధియా, అక్టోబర్ 27 (ఆంధ్రజ్యోతి): గాజువాక డిపోకు చెందిన ఏపీ31జెడ్0305 నంబరు గల 55కే బస్సు కొత్తవలస నుంచి సింధియా కు వెళ్లే ఆర్టీసీ సర్వీసు బస్సులో సోమవారం ఐటీసీ యల్ దగ్గరకి వచ్చేసరికి బస్సుల్లో పొగలు వచ్చి, బస్సు మొత్తం వ్యాపించడంతో ప్రయాణికులు భయాందోళకు గురయ్యారు. ఈ సందర్భంగా డ్రైవర్ వెంటనే అప్రమత్తమై బస్సును రోడ్డు పక్కన నిలిపివేశాడు. వెంటనే ప్రయాణికులు బస్సు దిగి పరుగులు తీశారు. వర్షం కారణంగా బస్సులో షార్ట్ సర్క్యూట్‌తో పొగలు వచ్చాయని ప్రయాణికులు డ్రైవర్ తెలిపారు. అనంతరం ప్రయాణికలు వారి గమ్యస్థానాలకు చేరుకునేందుకు ఇబ్బందులు పడ్డారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కండీషన్‌లో ఉన్న బస్సులను నడపాలని పలువురు ప్రయాణికులు కోరారు.

రహదారి విస్తరణకు శ్రీకారం

పెందుర్తి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): వేపగుంట-పినగాడి రహదారి విస్తరణ పనులను వీఎంఆర్‌డీఏ అధికారులు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా లక్ష్మిపురం నుంచి ఎక్స్‌కవేటర్ సాయంతో రహదారికి ఇరువైపులా ఉన్న చెట్లను తొలగించారు. ఈ రహదారి విస్తరణ కోసం పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు చొరవ చూపి వీఎంఆర్‌డీఏ, జీవీఎంసీ, ఆర్ అండ్ బీ అధికారులను సమన్వయం చేసి సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి నిధులు రాబట్టేలా కృషి చేశారు. ఎట్టకేలకు వేపగుంట-పినగాడి రహదారి విస్తరణ పనులు జరుగుతుండడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సినిమా గైడ్

- **బైసన్** : శారదా,
- **తమ్ముడు** : రమాదేవి
- **డూడ్** : శరత్, శ్రీరామా, లీలామహల్, శ్రీకన్య ఎస్.వి.సి.లలిత (శ్రీహరిపురం), లక్ష్మీనరసింహా-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)
- **క్రాంప్** : సంగం, కామేశ్వరి, వెంకటేశ్వర-1, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం),
- **ఓజి** కిన్నెర, కామేశ్వరి, శ్రీకన్య హెవెన్-3, మినీ మోహిని (గాజువాక), శ్రీకాంతి, సుకన్య
- **మిరాయి** సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 17, టమాటా 30, వంకాయలు (తెలుపు) 52, వంకాయలు (నలుపు) 52, బెండకాయలు 42, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 38, బీరకాయలు 40, ఆనపకాయ 24, కాలీఫ్లవర్ 40, క్యాబేజీ 26, క్యారెట్ 66, దొండకాయలు 44, బంగాళ దుంపలు 20, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 74, అల్లం (పాతది) 70, బరబాటి 46, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 50, బద్ధచిక్కుడు 66, దోస కాయలు 28, వెల్లుల్లి (పెద్దవి) 65, కొబ్బరికాయ (పెద్దది) 40, బీన్స్ (పెన్సిల్) 70, కీర దోస 20, క్యాప్సికమ్ 70, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 34, చిలగడదుంపలు 34, కంద 48, దేముడుచిక్కుడు 70, గోరుచిక్కుడు 42, కూర పెండలం 36, బ్రకోలి 45, పనసపొట్టు 200, కొండటపిరి 64, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 22, మామిడి అల్లం 90, బొప్పాయి 32, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	565
విజయనగరం	569
శ్రీకాకుళం	569

చికెన్ ధరలు	
బ్రాయిలర్	
రైతు ధర	115
లైవ్ ధర	135
విత్ స్కిన్	240
స్కిన్‌లెస్	250


గోపాలపట్నం ప్రధాన రహదారిలో కురుస్తున్న వర్షం


పెందుర్తిలోని కృష్ణరాయపురంలో రోడ్డుకు అడ్డంగా కూలిన చెట్టు


ఛిద్రంగా మారిన ఆటోనగర్-డీ బ్లాక్ నుంచి యాదవజగ్గరాజుపేట వెళ్లే రహదారి

తెరిపివ్వని వర్షం

- మొంథా ప్రభావంతో జోరుగా కురుస్తున్న వాన
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- పలుచోట్ల కూలిన చెట్లు
- ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్న ప్రత్యేక అధికారులు
- తహశీల్దార్ కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లు
- ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని కోరిన ఎమ్మెల్యేలు పి.గణబాబు, పంచకర్ల రమేశ్‌బాబు

గాజువాక, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో తెరిపివ్వకుండా భారీ వర్షం కురుస్తోంది. దీంతో పాత గాజువాక కూడలి వర్షపు నీటితో నిండిపోయింది. లోతట్టు ప్రాంతాల్లోనూ పెద్ద ఎత్తున నీరు చేరింది. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ప్రధాన కాలువల్లోని పూడికను ఎప్పటికప్పుడు తొలగిస్తూ నీటి ప్రవాహనికి అడ్డంకులు లేకుండా జడ్సీ శేషాద్రి పర్యవేక్షణలో డీఎంహెచ్‌వో కిరణ్‌కుమార్ చర్యలు చేపట్టారు. కొన్ని ప్రధాన కాలువల వద్ద ఎక్స్‌కవేటర్లను ఉంచారు.

అదేవిధంగా గాజువాక మండల పరిధిలోని యారాడ తీరం, పెదగంట్యాడ మండల పరిధిలో గల అప్పికొండ సముద్ర తీర ప్రాంతాల ప్రజలను అధికారులు, ప్రత్యేక బృందాలు అప్రమత్తం చేశాయి. అవసరమైతే తీర ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు కల్యాణ మండపాలను సిద్ధం చేశారు. కొండవాలు ప్రాంతాలను ప్రత్యేక బృందాలు పరిశీలించాయి. పలువురిని ఇళ్లు ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు చర్యలు చేపట్టారు ఇదిలావుండగా గాజువాక జోనల్ కార్యాలయం, తహశీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు వార్డుల వారీగా పరిస్థితిని సమీక్షిస్తున్నారు. మంగళ, బుధవారాల్లో వర్షాల తీవ్రత మరింత అధికంగా ఉండనున్నందున జోనల్ కార్యాలయంలో స్పెషలాఫీసర్ బి.దయానిధి ఈపీడీసీఎల్, తాగునీరు, పోలీస్, జీవీఎంసీ, రెవెన్యూ, తదితర విభాగాల అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించి అందరినీ అప్రమత్తం చేశారు. సమావేశంలో జడ్సీ శేషాద్రి, తహశీల్దార్ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆటోనగర్: భారీ వర్షానికి అసలే అంతంత మాత్రంగా ఉన్న 71వ వార్డు పరిధిలోని ఆటోనగర్‌లోని రోడ్లన్నీ మరింత ఛిద్రంగా మారాయి. అడుగుల మేర గోతులు ఏర్పడడంతో ఆయా మార్గాల్లో రాకపోకలు సాగించేందుకు తుంగ్లాం, ఆటోనగర్, చట్టివానిపాలెం, యాదవ జగ్గరాజుపేట, కాపుజగ్గరాజుపేటకు చెందిన ప్రజలతోపాటు ఆటోనగర్‌లోని పలు కర్మాగారాలకు వెళ్లే ఉద్యోగులు, కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

అగనంపూడి: తెరిపివ్వకుండా కురుస్తున్న వర్షానికి ప్రధాన గెడ్డలు పొంగి ప్రవహిస్తున్నాయి. ముఖ్యంగా కొండ వాగు నుంచి వచ్చే బొర్రమ్మ గెడ్డ నీటి ఉధృతి కారణంగా లోతట్టు ప్రాంతాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. తలారివానిపాలెం, ఫార్మాసిటీ కాలనీల్లో గల వీధి రోడ్లు ధ్వంసమయ్యాయి. దువ్వాడ ప్రధాన రహదారిలో పెద్దఎత్తున వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహన చోదకులు, పాదచారులు నానాపాట్లు పడుతున్నారు. అగనంపూడి ఏరియా ఆస్పత్రి సమీపంలో రోడ్డు కోతకు గురైంది. రోజువారి కార్మికులు ఇళ్లకే పరిమితమయ్యారు.


అగనంపూడి సమీప తలారివానిపాలెం వద్ద రహదారిపై ప్రవహిస్తున్న వర్షపు నీరు


మల్కాపురం స్టేషన్ వద్ద వరద నీరు సజావుగా పోయేందుకు ఎక్స్‌కవేటర్‌తో డివైడర్‌ను తొలగింపజేస్తున్న పోలీసులు

పెదగంట్యాడ: పెదగంట్యాడలోని లోతట్టు ప్రాంతాలు జల మయమయ్యాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం వల్ల నిర్వాసిత కాలనీల్లోని డ్రైనేజీలు పొంగిపొర్లాయి. నీలాపు వీధి, సీతానగరం, బాలచెరువు, సీకువానిపాలెం నీటి సామర్థ్యానికి తగ్గట్టుగా డ్రైనేజీలు లేకపోవడంతో రోడ్లపై నీరు ప్రవహిస్తోంది. ఇండస్ట్రియల్ ఎస్టేట్ ప్రధాన రహదారిలో పెద్ద ఎత్తున నీరు నిలిచింది. హౌసింగ్ బోర్డు కాలనీ నుంచి టీసీ రోడ్డు కలిసే ప్రాంతంలో, కొండవాలు ప్రాంతాలైన దయాళ్‌నగర్, బానోజీ కాలనీ, ప్రియదర్శనీ కాలనీ, వాంబే కాలనీ, అశోక్‌నగర్ ప్రాంతాల వర్షపు నీరు ప్రవహిస్తుంది.

గోపాలపట్నం: తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షానికి జనసంచారం లేక నిత్యం రద్దీగా ఉండే గోపాలపట్నం ప్రధాన రహదారి, వ్యాపార సముదాయాలు వెలవెలబోయాయి. కొండవాలు ప్రాంతాల నుంచి వచ్చిన వర్షపు నీరు గెడ్డల నుంచి ప్రవహించి కొత్తపాలెం శివారులోని వ్యవసాయ క్షేత్రాల్లో చేరింది. తుఫాన్ నేపథ్యంలో నియోజకవర్గంలోని కొండవాలు ప్రాంత ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని పశ్చిమ ఎమ్మెల్యే పిగణబాబు సూచించారు. శిథిల ఇళ్లల్లో ఉండే వారంతా సురక్షిత ప్రదేశాలకు వెళ్లాలని కోరారు. రెవెన్యూ, పోలీసు అధికారులు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు అండగా ఉండేందుకు కార్యకర్తలు అందుబాటులో ఉండాలని పిలుపునిచ్చారు.

మల్కాపురం: భారీ వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. పలుచోట్ల చెట్లు కూలిపోయాయి. మల్కాపురం పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న ప్రధాన రహదారి వర్షపు నీటితో పూర్తిగా నిండిపోయింది. వరద నీరు డివైడర్ ఎత్తుకు చేరడంతో ఈ మార్గంలో రాకపోకలను నిలిపివేశారు. ఈ సందర్భంగా మల్కాపురం సీఐ గొలగాని అప్పారావు, ట్రాఫిక్ సీఐ షణ్ముఖరావులు డివైడర్‌ను ఎక్స్‌కవేటర్ సాయంతో విరగ్గొట్టి వరద నీరు పారేలా చర్యలు చేపట్టారు. అయినప్పటికీ జోరువానకు మళ్లీ ఈ మార్గంలో పెద్దఎత్తున నీరు చేరడంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పలేదు. పలువురి వాహనాలు నీటిలో మునగడంతో మరమ్మతులకు గురయ్యాయి. కాగా మహాలక్ష్మి థియేటర్ ఎదురుగా ఉన్న ఐటీసీ ప్రాంగణం వర్షపు నీటితో చెరువును తలపిస్తోంది. పలు ఆయిల్ ట్యాంకర్లు ఆగిపోయాయి. ఏకేసీ కాలనీకి చెందిన పెద్ద కాలువ పూర్తిగా నిండిపోయింది. హెచ్‌పీసీఎల్ గేటు ఎదురుగా కూడా వర్షపు నీరు పెద్దఎత్తున నిలిచిపోయింది. ఇదిలావుండగా వర్షాల కారణంగా ములగాడ మండల పరిధిలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తినా అధికారులు అందుబాటులో ఉంటారని తహశీల్దార్ రమేశ్‌నాయుడు తెలిపారు. ప్రజలు ఆయా అధికారులను 8985444441, 8297890771, 9494296936, 9676792951, 8106550615, 8712216816, 7382290474 సెల్ నంబర్లను సంప్రదించవచ్చని సూచించారు.

పెందుర్తి: భారీ వర్షం, ఈదురు గాలులకు కృష్ణరాయపురంలో ఓ చెట్టు నేలకొరిగింది. పలుచోట్ల రోడ్లపైకి వరద నీరు లోతట్టు ప్రాంతాల్లో పెద్దఎత్తున చేరడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నియోజకవర్గ ప్రత్యేక అధికారి సత్తిబాబు, తహశీల్దార్ వెంకట అప్పారావు ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సూచనలు చేశారు. పెందుర్తి, వేపగుంట, చీమలాపల్లిల్లో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. అలాగే వీఆర్వో, వీఆర్‌ఏలతో కూడిన 14 మంది సిబ్బందితో తహశీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్టు తహశీల్దార్ వెంకట అప్పారావు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో 9100064936 సెల్ నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఇదిలావుండగా తుఫాన్ నేపథ్యంలో నియోజకవర్గ ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు ఒక ప్రకటనలో కోరారు. మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని సూచించారు. ప్రజల రక్షణ, సహాయార్థం కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68, 69 వార్డుల్లోని పలు రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. ఆటోనగర్ నుంచి తుంగ్లాం కాలనీకి వెళ్లే ప్రధాన రోడ్డులో వర్షపు నీరు నిలిచిపోవడంతో ద్విచక్ర వాహనచోదకులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులకు గురవుతున్నారు. జాతీయ రహదారి నుంచి షీలానగర్‌కు వెళ్లే ప్రధాన రహదారి, హరిజన జగ్గయ్యపాలెం వద్ద, వెంకటేశ్వర కాలనీ వద్దనున్న రోడ్డులో నీరు నిలవడంతో రాకపోకలు సాగించేందుకు స్థానికులు నానాపాట్లు పడుతున్నారు.


తుంగ్లాం ప్రధాన రహదారిలో నిలిచిన వర్షపు నీరు


మల్కాపురంలో వాన నీటిలో వాహనదారుడి పాట్లు

ముక్కంటికి భక్త నీరాజనం

- కార్తీక తొలి సోమవారం భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు

కూర్మన్నపాలెం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం తొలి సోమవారం పలు ప్రాంతాల్లోని శివాలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. ఓం నమశ్శివాయ, హరహర మహాదేవ శంభో శంకర. నామస్మరణంతో ఆయా ఆలయాలు మార్మోగాయి. ఇందులో భాగంగా 86వ వార్డు మాతృశ్రీ నగర్‌లోని శ్రీకాశీఅన్నపూర్ణాదేవి సమేత శ్రీవిశ్వేశ్వరాలయంలో ధర్మకర్త దామా సుబ్బారావు, దమయంతి దంపతుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు చ ఏశారు. వేకువజామున 4 గంటల నుంచే ఆలయం వద్ద భక్తులు బారులుతీరారు. అర్చకులు కార్తీకమాస విశిష్టతను భక్తులకు వివరించారు. కణితి కాళింగుల వీధిలోని శ్రీకార్తికేయ, శ్రీస్వర్ణాకర్షణ భైరవ, శ్రీభువనేశ్వరీదేవి సహిత శ్రీపంచముఖేశ్వరస్వామి ఆలయంలో పూజలు, పంచామృతాభిషేకాలు జరిపారు. 87వ వార్డు పరిధి వడ్లపూడిలో శ్రీసీతారామ లింగేశ్వరస్వామి ఆలయంలోని బ్రహ్మసూత్ర శివలింగం వద్ద ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో విచ్చేసిన భక్తులు ప్రత్యేక పూజలు, దీపారాధనల్లో పాల్గొన్నారు. కణితిలోని శ్రీఉమామార్కండేశ్వరస్వామి ఆలయంలోని శివలింగానికి విభూదితో ప్రత్యేక అర్చన చేశారు. అలాగే 70వ వార్డు చట్టివానిపాలెంలోని శ్రీబాల త్రిపురసుందరి అమృతలింగేశ్వరస్వామి ఆలయంలోని శివలింగానికి పంచామృతాభిషేకాలు చేశాక స్వామివారిని వెండి నాగా భరణం, ఇతర ఆభరణాలు, పూలమాలలతో శోభాయమానంగా అలంకరించగా, అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆటోనగర్ సమీప తోకాడ దుర్గామల్లికార్జునస్వామి ఆలయంలో స్ఫటిక లింగానికి విశేష పూజలు, పంచామృతాభిషేకాలు జరిపారు.

ఉక్కుటౌన్‌షిప్: స్టీల్ ప్లాంట్ లోపల గల పురాతన శివాలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, రుద్రాభిషేకాలు చేశారు. ప్లాంటుకు పూర్వ వైభవం రావాలని, ప్రతి ఉద్యోగి సుఖ సంతోషాలతో ఉండాలని ప్రత్యేక పూజలు జరిపారు. పూజల్లో ఆలయ కమిటీ ప్రతినిధులు బద్రు నాయక్, యేల్లేటి శ్రీనివాసరావు, శ్రీనివాస్, కనకరెడ్డి, అర్చకులు నాగేశ్వరశర్మ పాల్గొన్నారు.


వేపగుంట పేరాలివానిపాలెం ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకుడు

అగనంపూడి: ఇక్కడి పెదమడక ఉమామహేశ్వరాలయం, పాత అగనంపూడి లింగాల తిరుగుడి, పాతదానబోయినపాలెం ఉమారామలింగేశ్వర స్వామి, జాబిలి హిల్స్‌లోని శివాలయాలకు భక్తులు పోటెత్తారు. శివలింగాలకు పూజలు, అభిషేకాలు చేశారు.

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్‌లోని సోమేశ్వరాలయం, అక్కిరెడ్డిపాలెం సాయి సహిత, తుంగ్లాం శివాలయాలు భక్తుల శివనామస్మరణతో మార్మోగాయి. తుంగ్లాం శివాలయంలో ప్రత్యేక పూజలు, పంచామృతాలతో అభిషేకాలు జరిపారు. పూజల్లో కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డితో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. షీలానగర్ సోమేశ్వరాలయంలో పూజలు, హోమాలు చేశారు.

గాజువాక: ఇక్కడి వంటిళ్ల జంక్షన్, మామిడితోట, మోహర్ నగర్, అదర్శ మైదానం, సమతానగర్ శివాలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆయా ఆలయాలకు భక్తులు పెద్దసంఖ్యలో తరలి రావడంతో ఎక్కడ ఎటువంటి తలెత్తకుండా ఆలయ కమిటీల ప్రతినిధులు తగిన ఏర్పాట్లు చేశారు.

పెందుర్తి/పెందుర్తి-రూరల్: మండలంలోని శివాలయాలకు భక్తులు పోటెత్తారు. సరిపల్లిలోని స్వయంభు శివాలయంలో 1,008 లీటర్ల పాలతో స్వామివారికి క్షీరాభిషేకం చేశారు. పాత పెందుర్తి, సుజాతనగర్, చిన ముషిడివాడ, పురుషోత్తపురం... వుడాకాలనీ, రత్నగిరి నగర్, రాంపురం, పినగాడి, చింతలఅగ్రహారం, చీమలాపల్లి, పురుషోత్తపురం హౌసింగ్‌బోర్డు కాలనీ, ప్రశాంతినగర్‌లోని శైవక్షేత్రాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు.

వేపగుంట/ఎన్ఏడీ: గ్రేటర్ 52,90, 93,94 వార్డుల్లోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కృష్ణానగర్, రవినగర్, వేపగుంట, సేనాతివానిపాలెం, ప్రహ్లాదపురం శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అలాగే లక్ష్మీనగర్-ఎఫ్ బ్లాక్‌లో కొలువైన శ్రీఉమాశంకరగణపతి ఆలయంలో ఉదయం 4 గంటల నుంచే అభిషేకాలు, అర్చనలు జరిపారు. సునర్తకాలనీ దగ్గర సీతారామరాజు నగర్, ఎన్ఏడీ కూడలి, కాకానీనగర్‌లో గల శివాలయాల్లో పూజలు నిర్వహించారు.

పెదగంట్యాడ: నెల్లిముక్కులోని కాశీవిశ్వేశ్వరాలయం, బాలచెరువులోని ఉమారామలింగేశ్వరాలయం, దుర్గవానిపాలెం రామలింగేశ్వరాలయం, ప్రియదర్శనీకాలనీ, వికాస్‌నగర్ కాలనీల్లోని శివాలయాలకు వేకువజాము నుంచే భక్తులు తరలివచ్చి పూజాది కార్యక్రమాల్లో పాల్గొన్నారు. భక్తులకు భారీ వర్షం వల్ల ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ నిర్వాహక కమిటీలు తగిన ఏర్పాట్లు చేశాయి.


86వ వార్డు పరిధి మాతృశ్రీనగర్‌లో శోభాయమానంగా అలంకరించిన శివలింగం


పెదమడక ఆలయంలో ప్రతేక అలంకరణలో శివలింగం


పెందుర్తి మండలంలోని ఓ శివాలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

బొండా జగన్‌కు సోదర వియోగం

- పరామర్శించిన ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు


బొండా జగన్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

కూర్మన్నపాలెం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర కార్యదర్శి 87వ వార్డు కార్పొరేటర్ బొండా జగన్ సోదరుడు, 'దేశం' అభిమాని బొండా అప్పలనాయుడు ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈ నేపథ్యంలో సోమవారం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివారావు బొండా జగన్ నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట నాయకులు పల్లా వెంకట విజయరామరాజు, రాజన్‌రాజు, డీవీ అప్పారావు, జాన్ రమేశ్, తదితరులు ఉన్నారు.

మృతుని కుటుంబానికి ఎమ్మెల్యే పల్లా పరామర్శ

పెదగంట్యాడ: జీవీఎంసీ 75వ వార్డు దుర్గవానిపాలెం కాలనీకి చెందిన వై.ఆకాశ్ (18) ఆటోనగర్‌లోని ఒక ఇండస్ట్రీలో పనిచేస్తూ విద్యుత్ షాక్‌కు గురై ఈ నెల 20న మృతి చెందాడు. ఈ సందర్భంగా గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు సోమవారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం ఇండస్ట్రీ యజమానిని పిలిచి మృతుని కుటుంబానికి నష్టపరిహారం ఇవ్వాలని సూచించగా, రూ.12 లక్షలు ఇచ్చేందుకు ఆయన అంగీకరించారు. ఏపీఐఐసీ డైరెక్టర్ ప్రసాదుల శ్రీనివాస్, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ పెంటిరాజు, తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా వుండాలి: ఐజీ

సాగర్‌నగర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ నేపథ్యంలో అనుక్షణం అప్ర మత్తంగా ఉండాలని కోస్టల్ సెక్యూరిటీ పోలీస్ ఇన్‌చార్జి ఐజీ గోపీనాథ్‌జెట్టి సూచించారు. రుషికొండ బీచ్‌ను సోమవారం సందర్శించారు. మత్స్యకారులు వేటకు వెళ్లకుండా చూడాలన్నారు. సందర్శకులను తీరంలోకి అనుమతించవద్దన్నారు. తుఫాన్ ఉధృతి మేరకు అవసరమైన మత్స్యకార గ్రామాల వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించడానికి సిద్ధంగా ఉండాలన్నారు.

'ఉక్కు'లో విజిలెన్స్ వారోత్సవాలు

ఉక్కుటౌన్‌షిప్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): సంస్థ ప్రగతిలో సమగ్రత, పారదర్శకత, నైతిక విలువలు ఎంతో ప్రముఖమని స్టీల్ ప్లాంట్ డైరెక్టర్లు పేర్కొన్నారు. సోమవారం స్టీల్ ప్లాంటులో విజిలెన్స్ వారోత్సవాలను ప్రారంభించారు. తొలుత ప్లాంట్ ప్రధాన పరిపాలన భవనంలో ప్రతిజ్ఞ చేపట్టారు. అనంతరం పలువురు డైరెక్టర్లు మాట్లాడుతూ నైతిక విలువలను నిలబెట్టడంలో, అవినీతి రహిత సంస్థను నిర్మించడంలో ప్రతి ఉద్యోగి కృషి చేయాలన్నారు. డైరెక్టర్లు ఏకే బాగ్చి, జీవీఎన్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ కోటి సంతకాల సేకరణ

మల్కాపురం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని వైఎస్ఆర్‌టీయూసీ ఆధ్వర్యంలో సోమవారం శ్రీహరిపురంలో నిర్వహించారు. వైఎస్ఆర్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గౌతం రెడ్డి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు కేకేరాజు, నియోజకవర్గ సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్‌లు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. ప్రతి ఇంటి నుంచి వైద్యుడు ఉండాలని ఆశయంతో వైసీపీ హయాంలో 17 మెడికల్ కళాశాలలను తీసుకువస్తే వాటిని ప్రైవేటుపరం చేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కూర్మన్నపాలెం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ అయ్యాయని, అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావించి రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రాగా తీర్చిదిద్దిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. 86వ వార్డు సాయిరామ్ నగర్‌లో సుమారు రూ.2 కోట్ల 96 లక్షలతో పలు అభివృద్ధి పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వ పాలన సాగుతోందని, కూటమి పాలనతో ప్రతి గ్రామం, నగరంలోని ప్రతి వార్డు అభివృద్ధి పరుగులు తీస్తోందన్నారు. గత ప్రభుత్వంలో ఆర్థిక వ్యవస్థ ఛిన్నాభిన్నమైనా ఎంతో అనుభవంతో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామన్నారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం నగరాభివృద్ధికి విశేష కృషి చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ డైరెక్టర్ ప్రసాదుల శ్రీనివాసరావు, టీడీపీ 86వ వార్డు అధ్యక్షుడు నల్లూరు సూర్యనారాయణ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

దోమల నివారణకు మందు పిచికారి

ఆటోనగర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 70వ వార్డు పరిధిలోని శ్రీనివాసనగర్ కాలనీలో సోమవారం డెంగ్యూ కేసు నమోదవ్వడంతో మలేరియా విభాగం అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి మురుగు నీటి నిల్వలు, ఇళ్ల ఆవరణల్లో దోమల నివారణకు క్రిమి సంహారక మందును పిచికారీ చేయించారు. డెంగ్యూ కేసు నమోదైన పరిసర ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ఎవరికైనా మలేరియా, డెంగ్యూ జ్వరాలు ఉన్నాయా, లేవా అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మలేరియా అధికారులు పాల్గొన్నారు.

కిటకిటలాడిన అయ్యప్ప ఆలయం

ఉక్కుటౌన్‌షిప్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్లాంటు అయ్యప్ప స్వామి ఆలయం సోమవారం భక్తులతో కిటకిటలాడింది. అయ్యప్ప మాలధారణ చేసిన భక్తులు అధిక సంఖ్యలో తరలివ చ్చారు. డిసెంబరు 1వ తేదీ వరకు మాలధారణ భక్తులకు మధ్యాహ్నం అన్న సమారాధన చేస్తుండడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వస్తున్నారు.

మేహాద్రిగెడ్డ జలాశయం నుంచి నీరు విడుదల

గోపాలపట్నం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మేహాద్రిగెడ్డకు ఇన్‌ఫ్లో పెరగింది. ఆదివారం సాయంత్రానికి రిజర్వాయర్ నీటిమట్టం 59.7 అడుగులుండగా సోమవారం ఉదయానికి 59.9 అడుగులకు చేరింది. ఈ నేపథ్యంలో 1,058 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. రిజర్వాయర్‌ను పెందుర్తి తహసీల్దార్ ఐ.వెంకట అప్పారావు, ఆర్ఐ హరి ప్రసన్న, ఇరిగేషన్ ఏఈఈ పినకిని, వర్క్ ఇన్‌స్పెక్టర్ సుబ్బరాజు పరిశీలించి సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఎడతెగని వర్షం


తీరంలో ఎగసిపడుతున్న అలలు


ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద నిలిచిన నీరు

మొంథా తుపాను ప్రభావం నగరంపై భారీగా పడింది. ఉదయం నుంచి ఎడతెరిపిలేని వర్షాలతో పౌర జీవనం అస్తవ్యస్త మయింది. ఎక్కడికక్కడ నీరు నిల్వ ఉండి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. తీరంలో అలలు ఎగసి పడుతున్నాయి. పర్యాటక ప్రదేశా లను మూసివేయడంతో జనం ఇళ్లకే పరిమితమయ్యారు.

- విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి


ఆర్కే బీచ్ తీరంలో ముందుకు వచ్చిన సముద్రం


బీచ్‌రోడ్డులో భారీ వర్షం


హనుమంతవాక వద్ద ఈదురుగాలులు




హనుమంతవాక జంక్షన్ వద్ద వాన ఉధృతి


జాలారిపేట వద్ద బోట్లను ఒడ్డుకు చేరుస్తున్న మత్స్యకారులు

ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి

» జీవీఎంసీ అధికారులకు మేయర్ పీలాశ్రీనివాసరావు ఆదేశం


తీరంలో పరిస్థితిని పరిశీలిస్తున్న మేయర్ పీలా

విశాఖపట్నం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నేపథ్యంలో నగరంలో ఎలాంటి పరిస్థితి ఎదురైనా సమర్థంగా ఎదుర్కొనేందుకు అన్నివిధాలుగాసిద్ధంగా ఉండాలని మేయర్ పీలా శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. తుఫాన్ ప్రభావంతో ఆదివారం రాత్రి నుంచి విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో నగరంలో పరిస్థితి, జన జీవనం, మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాలపై సోమవారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్‌రూమ్ నుంచి పర్యవేక్షించారు. వివిధచోట్ల చెట్లు, విద్యుత్‌స్తంభాలు కూలిపోవడంతో సహాయచర్యలు జరుగుతున్న తీరును తెలుసుకున్నారు. లోతట్టు, కొండప్రాంతాలపై ప్రత్యేక దృష్టిపెట్టాలని సూచించారు. అనంతరం జోన్-4 పరిధి అచ్చియ్యమ్మపేటలో ఏర్పాటుచేసిన పునరావాసకేంద్రానికి వెళ్లి వసతులను పరిశీలించారు. అనంతరం బీచ్‌రోడ్డుకు వెళ్లి అక్కడి పరిస్థితులు, సహాయకచర్యలను పర్యవేక్షించారు.

ఔషధ నియంత్రణ డీడీగా రజిత



డీడీ సుజాతకు పుష్పగుచ్ఛం ఇస్తున్న అధికారులు

సిరిపురం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఔషధ నియంత్రణ సంస్థ డిప్యూటీ డైరెక్టర్‌గా రజిత సిరిపురం బాలాజీ నగర్‌లోని కార్యాలయంలో సోమవారం బాధ్యతలు చేపట్టారు. విజయనగరం జిల్లా నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడి డీడీ విజయశేఖర్ ఉద్యోగోన్నతిపై గుంటూరు జిల్లాకు వెళ్లారు. రజిత గతంలో ఇక్కడ అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేశారు. ఆమెకు కార్యాలయ అధికారులు, ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

కూలిన చెట్లు... పొంగిన డ్రైన్లు

» యుద్ధప్రాతిపదికన జీవీఎంసీ సహాయక చర్యలు


ఎంవీపీకాలనీ లిటిల్‌ఏంజిల్స్ స్కూల్ వద్ద కూలిపోయిన చెట్లను తొలగిస్తున్న సిబ్బంది

విశాఖపట్నం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో వీస్తున్న గాలులకు నగరంలో పలుచోట్ల చెట్లు కూలిపోయాయి. జోన్-5 పరిధిలో 11, జోన్-3 పరిధిలో ఎనిమిది, జోన్-4లో రెండు, జోన్-6లో రెండు, జోన్-8 పరిధిలో ఒక చెట్టు రోడ్డుపై కూలాయి. వాహనాల రాకపోకలకు ఇబ్బంది తలెత్తకుండా వాటిని జీవీఎంసీ హార్టికల్చర్ విభాగం ఆధ్వర్యంలో వెంటనే తొలగించారు. మొంథా తుపాన్ కారణంగా నగరంలో చెట్లు కూలిపోయే పరిస్థితి వుంటుందని జీవీఎంసీ అధికారులు ముందుగానే గుర్తించి జోన్‌కు రెండు బృందాలను ఏర్పాటుచేశారు. వీరు కాకుండా జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కంట్రోల్ రూమ్‌కు అనుసంధానంగా మూడు బృందాలను మూడు షిఫ్టుల్లో పనిచేసేలా నియమించారు. వీరంతా చెట్లు కూలిపోతే వెంటనే వాటిని తొలగించేందుకు అవసరమైన యంత్రాలు, వాహనాలతో సిద్ధంగా ఉంటారు. హార్టికల్చర్ డిప్యూటీ డైరెక్టర్ దామోదర్ ఆయా బృందాలను, కంట్రోల్‌రూమ్ సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ సహాయక చర్యలు చేపడుతున్నారు. ఆదివారం రాత్రి నుంచి వర్షం కురుస్తుండడంతో గెడ్డలు, డ్రైనేజీలు పొంగి ప్రవహించాయి. ఈ నేపథ్యంలో గెడ్డల్లో పూడికతీత పనులను ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో చేపడుతున్నారు. జ్ఞానాపురం శ్మశానవాటిక ప్రహరీని ఆనుకుని డ్రెయిన్ ఉధృతంగా ప్రవహించడంతో గోడ కొంతభాగం కూలిపోయింది. కొండవాలు ప్రాంతాల్లో ఉంటున్న వారిని యూసీడీ ఆధ్వర్యంలో పునరావాస కేంద్రాలకు తరలించాలని అధికారులు నిర్ణయించారు.

'ఉక్కు'లో ఎగ్జిక్యూటివ్‌లకు 12 గంటల డ్యూటీ

విశాఖపట్నం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తుపాన్ నేపథ్యంలో స్టీల్ ప్లాంటు యాజమాన్యం ప్రత్యేక చర్యలు చేపట్టింది. షిఫ్ట్ డ్యూటీలకు వెళ్లే ఎగ్జిక్యూటివ్ అధికారులను మినహాయించి మిగిలిన ఎగ్జిక్యూటివ్‌లు అందరికీ 12 గంటల డ్యూటీ వేసింది. ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు కొందరికి, ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు మరికొందరికి డ్యూటీలు వేశారు. వర్షాల వల్ల ఆయా విభాగాలకు నష్టం జరగకుండా, మెటీరియల్ పాడైపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని యాజమాన్యం సూచించింది.

నకిలీనోట్ల కేసులో మరో ముగ్గురి అరెస్టు

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): నకిలీ నోట్ల కేసులో మరో ముగ్గురు నిందితులను అరెస్టు చేసి, రిమాండుకు తరలించినట్టు ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి తెలిపారు. ఎంవీపీ స్టేషన్‌లో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఈ నెల 22న టాస్క్ ఫోర్స్ సీఐ అప్పలనాయుడు, శాంతిభద్రతల సీఐ కేఎస్ఎస్‌వీ ప్రసాద్, ఎస్ఐలు ఖాదర్ బాషా, హరీష్ సిబ్బందితో ఎంవీపీ కాలనీ పదకొండో సెక్టరులోని ప్లాట్ నంబరు 117లో దాడి చేయగా, మధ్యప్రదేశ్ రాష్ట్రం, బర్వానీ జిల్లా, బల్వాడి మండలం, కర్మలా గ్రామానికి చెందిన శ్రీరామ్ అలియాస్ గుప్తా (60), పాల వరప్రసాద్, కొత్త ఆనంద్, కొప్పల గంగాధర్ దొంగనోట్లు ముద్రిస్తున్నట్టు గుర్తించారు. గుప్తాను అప్పుడే అరెస్టు చేయగా, మిగిలిన ముగ్గురు నిందితులను ఆదివారం అరెస్టు చేశామని ఏసీపీ తెలిపారు.

కేజీహెచ్ నుంచి రిమాండ్ ఖైదీ పరారీ

మహారాణిపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న రిమాండు ఖైదీ పరారయ్యాడు. వివరాలిలా ఉన్నాయి.. ఈ నెల 18న గంజాయి రవాణా చేస్తూ తమిళ సెల్వన్ నటరాజన్ (40) అనకాపల్లి ప్రాంతంలో పోలీసులకు పట్టుబడ్డాడు. అతడిని సెంట్రల్ జైల్‌కు తరలించారు. అతడికి పలు రకాల వ్యాధులు ఉండడంతో ఈ నెల 22న కేజీహెచ్‌లో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి సుమారు 2.30 గంటల సమయంలో తీవ్రమైన కడుపునొప్పి వస్తోందని కాపలాగా ఉన్న ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్‌కు చెప్పడంతో అతను డాక్టర్‌ను తీసుకువచ్చేందుకు వెళ్లాడు. ఇదే అదనుగా ఖైదీ పరారయ్యాడు. దీంతో వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పరారీకి నిందితుడి విఫలయత్నం

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గంజాయి కేసులో ఓ నిందితుడు పోలీసుల నుంచి తప్పించుకునేందుకు విఫలయత్నం చేశాడు. ఈ విషయాన్ని పోలీసులు రహస్యంగా ఉంచేందుకు ప్రయత్నిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం ఈ నెల 25న నాలుగు కిలోల గంజాయితో ఓ రౌడీ షీటర్‌ను ఎంవీపీ పోలీసులు అరెస్టు చేశారు. పెదజాలారిపేట సమాధుల వద్ద ఉన్న మురబండ రాము (27)ను తనిఖీ చేయగా నాలుగు కిలోల గంజాయి లభించింది. అతడిని రిమాండుకు పంపించడానికి ముందు వైద్య పరీక్షల కోసం కేజీహెచ్‌కు తీసుకువెళ్లారు. అతడి సంగతి తెలిసిన అధికారులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించి, ముగ్గురు సిబ్బందిని పంపించారు. అయినప్పటికీ కేజీహెచ్ ప్రాంగణంలోకి వెళ్లిన తర్వాత నిందితుడు పరుగులు తీశాడు. ఉలిక్కిపడిన సిబ్బంది అతడి వెంట పడి పట్టుకుని, రిమాండుకు తరలించారు. సిబ్బంది అప్రమత్తంగా లేకపోవడంపై అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారని తెలిసింది.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు


మద్దిలపాలెం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో జీవీఎంసీ ఉద్యోగి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన సోమవారం రేసపువానిపాలెం రహదారిలో జరిగింది. త్రీటౌన్ ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాలివి. 22వ వార్డు జీవీఎంసీ పారిశుధ్యం విభాగం సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న జి.గురువులు దాబాగార్డెన్స్‌లో నివాసముంటున్నాడు. ఇంటి నుంచి విధులకు బయలుదేరి, రేసపువానిపాలెం నుంచి మద్దిలపాలెం వైపు రాంగ్ రూట్‌లో ప్రయాణించాడు. పిఠాపురంకాలనీకి చెందిన విద్యార్థి జయదీప్ రేసపువానిపాలెం వద్ద బైక్‌పై వేచివున్నారు. ఎదురుగా వస్తున్న గురువులు జయదీప్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో గురువులు తీవ్రంగా గాయపడ్డాడు. జయదీప్‌కు స్వల్పగాయాలయ్యాయి. పోలీసులు గురువులను కేజీహెచ్‌కు తరలించారు. ప్రస్తుతం అతను అపస్మారక స్థితిలో ఉన్నాడు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఏయూలో వాక్ ఇన్ ఇంటర్వ్యూలు వాయిదా

విశాఖపట్నం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తుపాను నేపథ్యంలో ఆంధ్ర విశ్వవిద్యాలయంలో 28న నిర్వహించాల్సిన ఇంటర్వ్యూలను వాయిదా వేశారు. ఇక్కడి ఆరోగ్య కేంద్రంలో కాంట్రాక్టు ప్రాతిపదికన సిబ్బందిని నియమించేందుకు వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించేందుకు అధికారులు సమాయత్తమయ్యారు. అయితే తుపాన్ నేపథ్యంలో వచ్చే నెల ఆరోతేదీకి వాయిదా వేస్తున్నట్టు రిజిస్ట్రార్ ప్రకటించారు. ఆరోజు ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ హాల్‌లో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు.

రైతుబజారులో టమాటాకు డిమాండ్

» కొనుగోలుకు బారులు తీరిన వినియోగదారులు


గోపాలపట్నం రైతుబజారులో టమాటా కోసం క్యూ

గోపాలపట్నం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తుపాను ప్రభావంతో టమాటా ధర ఒక్కసారిగా పెరిగిపోయింది. అంతేకాకుండా సరకు రాకపోవడంతో డిమాండ్ ఏర్పడింది. ఈ నేపథ్యంలో సోమవారం గోపాల్నం రైతుబజారులో కొనుగోలుదారులు క్యూ కట్టారు. చిత్తూరు, అనంతపురం జిల్లాలతో పాటు కోల్‌కత్తా నుంచి నగరానికి టమాటా దిగుమతి అవుతోంది. వర్షాల కారణంగా దిగుమతి తక్కువగా ఉంది. రైతుబజారులో టమాటా కిలో రూ.30కి విక్రయిస్తున్నారు. హోల్‌సేల్ మార్కెట్‌లో కిలో రూ.36కి చేరగా, బహిరంగ మార్కెట్‌లో రూ.50కి విక్రయిస్తున్నారు.